


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 27-11-2025 | సంపుటి - 25 | సంచిక -191 | రూ : 4 | పేజీలు: 8





## యూపీఎస్సీకి 100 ఏళ్లు..

డిల్లీలో ఘనంగా ప్రారంభమైన శతవార్షికోత్సవ వేడుకలు

- వందేళ్లు పూర్తి చేసుకున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
- వేడుకల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఓం బిర్లా, జితేంద్ర సింగ్
- నియామక వ్యవస్థల బలోపేతంపై రెండు రోజుల జాతీయ సదస్సు

2లో

## రేపటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లు..

- కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలు నిర్వహించాలని సూచన
- ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్న ఎన్నికల కమిషనర్

2లో



## తెలంగాణకు కొత్త పేరు పెట్టాల్సి వస్తుంది

మద్యం షాపులపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు



2లో

- విచ్చలవిడిగా మద్యం దుకాణాల ఏర్పాటుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- ఇలాగే పెంచితే తెలంగాణకు కొత్త పేరు పెట్టాల్సి వస్తుందని వ్యాఖ్య
- నివాసాల మధ్య మద్యం షాపుపై స్థానికులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ

## టెర్రర్ కేసు దోషితో తల్లి పెళ్లి..

తనయుడిని ఉగ్రవాదిగా మార్చేందుకు యత్నం

- కేరళలో 16 ఏళ్ల బాలుడిని ఐసిస్‌లోకి లాగేందుకు తల్లి కుట్ర
- టెర్రర్ కేసు దోషిని వివాహం చేసుకున్న బాలుడి తల్లి



2లో

## మొరాయించిన గూగుల్ మీట్..

- వేలాది యూజర్లకు అవస్థలు
- దేశవ్యాప్తంగా నిలిచిపోయిన గూగుల్ మీట్ సేవలు
- మీటింగ్‌లలో చేరలేక వేలాది మంది యూజర్ల ఇబ్బందులు
- 502 ఎర్రర్, సర్వర్ కనెక్షన్ సమస్యలతో అవస్థలు
- సమస్య ఉన్నట్లు అంగీకరించిన గూగుల్

2లో



## ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారం..

మాగంటిపై కేసు వెనక్కి తీసుకున్నానని వెల్లడి

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన నవీన్ యాదవ్
- నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ
- సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని ఆవేదన
- ఉప ఎన్నికలో మద్దతిచ్చిన ఎంఐఎంకు కృతజ్ఞతలు తెలిపిన నవీన్



2లో

## పండగ ప్రయాణం భారం..

హైదరాబాద్‌విశాఖ బస్సు టికెట్ రూ.7000



2లో

- సంక్రాంతికి చుక్కలనంటుతున్న ప్రైవేట్ బస్ చార్జీలు
- విమాన టికెట్లను మించిపోయిన బస్సుల ధరలు
- ఆర్టీసీ, రైళ్లలో టికెట్లు ఫుల్.. ప్రైవేటు ఆపరేటర్ల దోపిడీ
- పండక్కి ఊరెళ్లాలంటే ప్రయాణికుల జేబుకు చిల్లు

# పండగ ప్రయాణం భారం.. హైదరాబాద్-విశాఖ బస్సు టికెట్ రూ.7000

హైదరాబాద్, నవంబర్ 26: సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లాలనుకునేవారికి ప్రైవేట్ ట్రావెల్స్ చుక్కలు చూపిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు, రైళ్లలో టికెట్లు ఇప్పటికే పూర్తిగా నిండిపోవడంతో ప్రైవేటు ఆపరేటర్లు ఇదే అదునుగా ఛార్జీలను భారీగా పెంచేశారు. కొన్ని మార్గాల్లో విమాన టికెట్ ధరలను మించి బస్సు చార్జీలు ఉండటం ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తోంది. సంక్రాంతి పండగ జనవరి 13, 14 తేదీల్లో రానుండగా దానికి ముందు వారాంతం కలిసి రావడంతో జనవరి 9, 10 తేదీల్లో ప్రయాణాలకు తీవ్రమైన డిమాండ్ ఏర్పడింది. ఈ అవకాశాన్ని ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం వెళ్లే బస్సుల టికెట్ ధరలు ఆకాశాన్నంటాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో టికెట్ ధర సుమారు రూ.1,880 ఉండగా, ప్రైవేటు స్లీపర్ బస్సుల్లో ఇదే ధర రూ.5,000 నుంచి రూ.6,999 వరకు పలుకుతోంది. ఆశ్చర్యకరంగా ఇదే మార్గంలో జనవరి 9న విమాన టికెట్ ధర సుమారు రూ.6,500 మాత్రమే ఉండటం గమనార్హం. అంటే బస్సు ప్రయాణం విమానం కంటే ఖరీదుగా మారింది. ఈ లెక్కన ఐదుగురు సభ్యులున్న ఒక కుటుంబం ప్రైవేట్ బస్సులో విశాఖపట్నం వెళ్లాలంటే కేవలం టికెట్లకే రూ.30,000 నుంచి రూ.35,000 వరకు ఖర్చు చేయాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. పండగ రద్దీ దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యేక బస్సులు, రైళ్లను ప్రకటించకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ ఆపరేటర్లను ఆశ్రయించక తప్పడం లేదు. ఈ దోపిడీని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## రేపటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లు..

హైదరాబాద్, నవంబర్ 26: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఆమె సూచించారు. కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల నియామావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆమె అన్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియతో పాటు భద్రత, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సందర్భంగా చర్చించారు. అదనపు డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారం...

హైదరాబాద్, నవంబర్ 26 : జూబ్లీహిల్స్ నియోజకవర్గం నూతన ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం నవీన్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ దినోత్సవం రోజున ఎమ్మెల్యేగా ప్రమాణం చేయడం తన అదృష్టమని నవీన్ యాదవ్ అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తప్పకుండా నెరవేరుస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో తనతో పాటు తన కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌పై తాను వేసిన కేసును వెనక్కి తీసుకున్నట్లు తెలిపారు. గోపీనాథ్ జీవించి ఉన్నా, లేకపోయినా నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరిగి ఉండేదని, కేసు కోర్టులో విచారణ దశలో ఉండగానే ఆయన మరణించారని పేర్కొన్నారు. ఉప ఎన్నికలో తమకు మద్దతుగా నిలిచిన ఎంఐఎం పార్టీకి నవీన్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జూబ్లీహిల్స్ గెలుపు కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచిందని ఆయన అభిప్రాయపడ్డారు.

## మొరాయించిన గూగుల్ మీట్..
### వేలాది యూజర్లకు అవస్థలు

ఢిల్లీ, నవంబర్ 26: ప్రముఖ వీడియో కాన్ఫరెన్సింగ్ ప్లాట్‌ఫాం గూగుల్ మీట్‌లో బుధవారం మధ్యాహ్నం నుంచి తీవ్ర అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా వేలాది మంది వినియోగదారులు ఆన్‌లైన్ సమావేశాల్లో చేరలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లాగిన్ సమస్యలతో పాటు, చాలామందికి "502 ఎర్రర్" అనే సందేశం కనిపిస్తుండటంతో గందరగోళం నెలకొంది. ఔటేజ్ ట్రాకింగ్ వెబ్‌సైట్ 'డౌన్‌డిటెక్టర్' నివేదిక ప్రకారం, సుమారు 65 శాతం మంది యూజర్లు వెబ్‌సైట్‌ను యాక్సెస్ చేయలేకపోతున్నారు. మరో 33 శాతం మంది సర్వర్ కనెక్షన్ సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. ఈ సమస్య ప్రధానంగా భారత్‌లోని వినియోగదారులపై ప్రభావం చూపుతున్నప్పటికీ, ఇతర దేశాల నుంచి కూడా కొందరు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ అంతరాయంపై గూగుల్ స్పందించింది. తమ సర్వీసుల్లో సమస్య తలెత్తినట్లు కంపెనీ స్టేటస్ డ్యాష్‌బోర్డులో నిర్ధారించింది. అయితే, సమస్యకు గల కారణాలు, పరిష్కారానికి పట్టే సమయంపై స్పష్టత ఇవ్వలేదు. ఈ సాంకేతిక లోపం కారణంగా ఆఫీస్ మీటింగ్‌లు, ఆన్‌లైన్ క్లాసులు, ఇతర వర్చువల్ కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం కలిగింది. దీంతో చాలామంది ఇతర ప్రత్యామ్నాయ ప్లాట్‌ఫామ్‌ల వైపు చూడాల్సి వచ్చింది.

## యూపీఎస్సీకి 100 ఏళ్లు...
### ఢిల్లీలో ఘనంగా ప్రారంభమైన శతవార్షికోత్సవ వేడుకలు

హైదరాబాద్, నవంబర్ 26 : దేశంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు అత్యున్నత ప్రామాణికంగా నిలిచే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వందేళ్లు పూర్తి చేసుకుంది. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని దేశ రాజధాని ఢిల్లీలో శతవార్షికోత్సవం ఘనంగా ప్రారంభమైంది. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. న్యూఢిల్లీలోని భారత మండపంలో జరిగిన ప్రారంభోత్సవంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కీలక సదస్సులో యూపీఎస్సీ ప్రస్తుత ఛైర్మన్, సభ్యులతో పాటు అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్మన్లు, సభ్యులు, మాజీ ఉన్నతాధికారులు, నిపుణులు పాల్గొంటున్నారు. ఈ వేడుకలను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా, దేశవ్యాప్తంగా నియామక ప్రక్రియలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. ముఖ్యంగా, పబ్లిక్ సర్వీస్ కమిషన్లను సామాన్యులకు మరింత చేరువ చేసేలా సరళమైన, పారదర్శకమైన, జవాబుదారీతనం గల విధానాలను రూపొందించడంపై ఈ సమావేశాల్లో లోతుగా చర్చిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పరీక్షా విధానాల్లో చేపట్టాల్సిన సంస్కరణలు, ఆధునిక సాంకేతిక సవాళ్లపైనా ఈ సదస్సులో ప్రధానంగా చర్చిస్తున్నారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాలను నియామక ప్రక్రియలో ఎలా వినియోగించుకోవాలి, ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలనే విషయాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. సుపరిపాలన, నైతిక విలువలతో కూడిన సర్వీసుల లక్ష్యంగా ఈ సదస్సు ముందుకు సాగుతోంది.

## వైట్‌హౌస్‌లో థ్యాంక్స్‌గివింగ్ వేడుక..
### రెండు టర్కీ కోళ్లకు క్షమాభిక్ష పెట్టిన ట్రంప్

అమెరికా, నవంబర్ 26: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో థ్యాంక్స్‌గివింగ్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఏటా కొనసాగే సంప్రదాయంలో భాగంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు టర్కీ కోళ్లకు క్షమాభిక్ష ప్రసాదించారు. నార్త్ కరోలినాకు చెందిన వాడిల్, గోబుల్ అనే పేరున్న ఈ రెండు టర్కీలకు ఆయన అభయమిచ్చారు. అధ్యక్ష భవనంలోని రోజ్‌గార్డెన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ట్రంప్ తన అర్ధాంగి మెలానియాతో కలిసి హాజరయ్యారు. 'ది నేషనల్ థ్యాంక్స్‌గివింగ్ టర్కీ' పేరుతో నిర్వహించిన ఈ వేడుకకు వాడిల్, గోబుల్ ప్రత్యేక అతిథులుగా రావాల్సి ఉంది. అయితే, కార్యక్రమంలో వాడిల్ మాత్రమే ప్రత్యక్షంగా పాల్గొంది. అయినప్పటికీ, అధ్యక్షుడు ట్రంప్ ఈ రెండు టర్కీలకూ క్షమాభిక్ష మంజూరు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ వేడుకల్లో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. అమెరికాలో థ్యాంక్స్‌గివింగ్ సందర్భంగా అధ్యక్షులు టర్కీలకు క్షమాభిక్ష పెట్టడం చాలా ఏళ్లుగా ఒక ఆనవాయతీగా వస్తోంది. ఈ క్షమాభిక్షతో ఈ రెండు కోళ్లను వధించకుండా వాటిని సంరక్షిస్తారు. అబ్రహం లింకన్ కాలం నుంచి వస్తున్న ఈ సంప్రదాయాన్ని 1963లో జాన్ ఎఫ్ కెన్నడీ అధికారికంగా ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రశాంతంగా జరిగే ఈ వేడుకను ట్రంప్ తన రాజకీయ ప్రసంగానికి వేదికగా మార్చుకున్నారు. ఈ సందర్భంగా ట్రంప్ డెమొక్రాట్లను, నేరాలను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇల్లినాయిస్ గవర్నర్ జేబీ ప్రిట్జ్‌కర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, చికాగోలో నేరాలను అరికట్టడానికి తనకు అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. గత ఏడాది అధ్యక్ష హోదాలో జో బైడెన్ టర్కీకి క్షమాభిక్ష పెట్టింది స్వయంగా కాదని, ఆటోపెన్ (యంత్రం) ద్వారా సంతకం చేశారని, కాబట్టి ఆ క్షమాభిక్ష చెల్లదని ఒక కుట్ర సిద్ధాంతాన్ని లేవనెత్తారు. టర్కీలకు డెమొక్రాటిక్ నేతలు చక్ షూమర్, నాన్సీ పెలోసీ పేర్లు పెట్టాలనుకున్నానని, కానీ ఒకవేళ అలా పెడితే "వారిద్దరినీ నేను ఎప్పటికీ క్షమించలేను" కాబట్టి విరమించుకున్నానని వ్యంగ్యంగా అన్నారు. అనంతరం ఆర్థిక వ్యవస్థపై మాట్లాడుతూ, "గుడ్ల ధరలు మార్చి నుంచి 86 శాతం తగ్గాయి. గ్యాసోలిన్ ధర త్వరలో గ్యాలన్‌కు 2 డాలర్లకు చేరువవుతుంది" అని ప్రకటించారు. అయితే, గుడ్ల ధరలు రికార్డు స్థాయి నుంచి తగ్గినా, ఇతర నిత్యావసరాల ధరలు ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం గ్యాసోలిన్ సగటు ధర 3.10 డాలర్లుగా ఉంది.

## తెలంగాణకు కొత్త పేరు పెట్టాల్సి వస్తుంది

హైదరాబాద్, నవంబర్ 26 : రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే తెలంగాణ రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేసింది. నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సత్యనారాయణ కాలనీలో నివాసాల మధ్య కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. మద్యం దుకాణాల నియంత్రణపై తమకు పూర్తి అధికారాలు లేనప్పటికీ, ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకునే వరకు తాము ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది. కనీసం రహదారిపైకి మద్యం దుకాణాలు కనిపించకుండా ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను కూడా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరణ ఇవ్వాలని నాగారం మున్సిపల్, ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు సదరు మద్యం దుకాణం యజమానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

## టెర్రర్ కేసు దోషితో తల్లి పెళ్లి.. తనయుడిని ఉగ్రవాదిగా మార్చేందుకు యత్నం

కేరళ, నవంబర్ 26: కేరళలో 16 ఏళ్ల బాలుడిని ఐసిస్ ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు కన్నతల్లే కుట్ర పన్నిన ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారించిన ఓ టెర్రర్ కేసులో దోషిగా తేలిన వ్యక్తితో కలిసి ఆమె ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే, బాలుడి తల్లి ఫిదా మహమ్మద్ అలీ, ఐసిస్ కుట్ర కేసులో దోషి అయిన సిద్ధిక్‌ను వివాహం చేసుకుంది. సిద్ధిక్‌కు అప్పటికే భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాలుడిలో ఉగ్రవాద భావజాలాన్ని నింపేందుకు (రాడికలైజేషన్) తొలుత లండన్ తీసుకెళ్లారు. అయితే, బాలుడు వారి భావజాలాన్ని వ్యతిరేకించడంతో తిరిగి భారత్‌కు పంపించేశారు. అనంతరం సిద్ధిక్ ఆ బాలుడిని తిరువనంతపురంలోని అల్మియా అకాడమీ అనే మదరసాలో చేర్పించినట్టు అక్కడి ఉపాధ్యాయుడు ఉస్తాద్ అహ్మద్ తెలిపారు. ప్రస్తుతం యూకేలో ఉంటున్న సిద్ధిక్ సోదరుడు అన్సర్‌కు కూడా తీవ్రవాద భావజాలం ఉందని, అతడు ఐసిస్ హత్యల వీడియోలు చూపించి తనను ఇబ్బంది పెట్టాడని బాలుడు తమతో చెప్పినట్టు ఉపాధ్యాయుడు వివరించారు. బాలుడి బంధువు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై కేరళ డీజీపీ రవదా ఆజాద్ చంద్రశేఖర్ స్పందిస్తూ.. బాలుడిని ఐసిస్ వైపు ఆకర్షించే ప్రయత్నం జరిగిందని, అతను నిరాకరించడంతో వెనక్కి పంపారని తెలిపారు. ఈ మేరకు ఫిర్యాదు అందగానే యూఏపీఏ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. సోదాల్లో లభించిన కొన్ని డిజిటల్ ఆధారాలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపినట్టు వెల్లడించారు. ఈ కుట్ర వెనుక రాష్ట్రంలో స్లీపర్ సెల్స్ రూపంలో పెద్ద నెట్‌వర్క్ ఉండే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు.

## రాజకీయ పార్టీ ఏర్పాటుపై స్పందించిన కవిత

హైదరాబాద్, నవంబర్ 26 : రాజకీయ పార్టీ ఏర్పాటుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, అయితే మహిళల నుంచి పార్టీ పెట్టాలనే డిమాండ్ ఎక్కువగా వస్తోందని ఆమె అన్నారు. పార్టీ అనేది ఎప్పుడైనా పెట్టవచ్చు కానీ, ప్రజల సమస్యలు తీర్చేలా ఏ పార్టీ అయినా ఉండాలని వ్యాఖ్యానించారు. ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి నివేదిక ఇంత తప్పులతడకగా ఉంటే బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఇక ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ గురించి తాను మాట్లాడనని, తాను మాట్లాడితే వారు బద్నాం చేస్తారని విమర్శించారు. జాగృతి నుంచి మాత్రం తాము ఒక నిర్ణయానికి వచ్చామని, అత్యధిక గ్రామాల్లో బీసీలు నామినేషన్లు దాఖలు చేసేలా ప్రయత్నం చేస్తామని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో బీసీ అభ్యర్థులు గెలిచేలా తమ వంతు ప్రయత్నం చేస్తామని అన్నారు. బీసీ జేఏసీ, బీసీ హక్కుల కోసం పోరాడేవారి కార్యక్రమాల్లో తాము పాల్గొంటామని అన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ గద్దెలు ఉన్నంత కాలం బీసీలకు అన్యాయం జరుగుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజలు, పార్టీలు మేల్కొనాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గడానికి మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలే కారణమని ఆమె ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

## రాజధానిలో వెంకన్న ఆలయ విస్తరణ...
### రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా భూమిపూజ

అమరావతి, నవంబర్ 26 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఆధ్యాత్మిక శోభను ఇనుమడింపజేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. వెంకటపాలెంలో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (నవంబరు 27) ఉదయం 10:30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. మొత్తం రూ.260 కోట్ల భారీ వ్యయంతో రెండు దశల్లో చేపట్టనున్న ఈ పనులకు ఆయన చేతుల మీదుగా భూమిపూజ జరగనుంది. ఈ కార్యక్రమంతో రాజధానిలో మరో ప్రతిష్ఠాత్మక నిర్మాణానికి అధికారికంగా శ్రీకారం చుట్టినట్లవుతుంది. విస్తరణ ప్రణాళిక ప్రకారం, మొదటి దశ పనులను రూ.140 కోట్లతో చేపట్టనున్నారు. ఇందులో భాగంగా రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ పటిష్టమైన ప్రాకారాన్ని నిర్మించనున్నారు. దీంతో పాటు ఏడంతస్తుల మహా రాజగోపురం, భక్తుల సౌకర్యార్థం ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం వంటివి నిర్మిస్తారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక ఆలయం, పవిత్ర పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ పనులను కూడా మొదటి దశలోనే పూర్తి చేస్తారు. వీటన్నింటి నిర్మాణానికి రూ.48 కోట్లు కేటాయించారు. ఇక రెండో దశ పనులను రూ.120 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. ఇందులో తిరుమల తరహాలో ఆలయ మాడ వీధులు, ఆలయానికి చేరుకునే అప్రోచ్ రోడ్లు, భక్తుల కోసం భారీ అన్నదాన కాంప్లెక్స్, యాత్రికులు బస చేసేందుకు విశ్రాంతి భవనం నిర్మిస్తారు. వీటితో పాటు అర్చకులు, ఆలయ సిబ్బంది నివాసం కోసం క్వార్టర్లు, పరిపాలనా భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ వంటి అత్యాధునిక సౌకర్యాలను కల్పించనున్నారు. ఇప్పటికే మొదటి విడత ఆలయ నిర్మాణం పూర్తికాగా, రేపటి శంకుస్థాపనతో రెండు, మూడో విడత పనులు ప్రారంభం కానున్నాయి. నాలుగో విడత పనులకు కూడా త్వరలోనే టెండర్లు పిలవనున్నారు.

**గత ప్రభుత్వ హయాంలో నిలిచిన పనులు**

రాజధాని అమరావతిని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో, తిరుమల శ్రీవారి ఆలయానికి ప్రతిరూపంగా కృష్ణా నది తీరాన 25.417 ఎకరాల్లో వెంకన్న ఆలయాన్ని నిర్మించాలని 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులు ముందుకుసాగలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, ఆగిపోయిన ఈ పనులకు మళ్లీ జీవం పోసి, వేగంగా పూర్తిచేయాలని నిర్ణయించింది.

# సైన్స్ లేనిది ప్రపంచం లేదు

**: ఎమ్మెల్యే కూనంనేని**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లాలో జరుగుతున్న 53వ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ప్రతి విద్యార్థి వరకు చేరినప్పుడే ఈ కార్యక్రమం నిజంగా సఫలీకృతమవుతుందని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. బుధవారం ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూవిద్యార్థులలో వైజ్ఞానిక దృక్పథం, సృజనాత్మక ఆలోచన, సమస్యలను పరిష్కరించే తాత్వికత పెంపొందించేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతో ఉపయుక్తం అని పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు జరగనున్న జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లాకేంద్రం కొత్తగూడెంలో ఏర్పాటు చేయడంతో జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారులు, నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థుల స్టాల్స్‌ను సందర్శించి ప్రయోగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మధురవాణి, జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి మాధవరావు, డీఈఓ కోఆర్డినేటర్లు సతీష్, సైదులు, నాగరాజశేఖర్, పరీక్షల విభాగం కార్యదర్శి నీరజ, చుంచుపల్లి, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి, చంద్రుగొండ మండల విద్యా అధికారులైన బాలాజీ, ఝుంకీలాల్, కృష్ణయ్య, సత్యనారాయణ, వివిధ పాఠశాలల హెడ్‌మాస్టర్లు సంజీవరావు, ద్రౌపది, వాణి, లక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మీడియా ఇన్‌చార్జ్‌లుగా రాములు, దస్తగిరి, జహంగీర్ షరీఫ్, రాజయ్య ఉన్నారు.

## అయ్యప్ప స్వాములకు
# అన్న ప్రసాద వితరణ...

* **నోమన్నగారి ఇంద్రజ-మాధవ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహణ...**
* **అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు గ్రామస్తులు...**



అందోలు, ప్రజాస్ఫూర్తి:అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన ఈశ్వరాలయం వద్ద అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నోమన్నగారి ఇంద్రజ మాధవ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో దేవాలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు తాయిలాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని అయ్యప్ప మాలను ధరించిన స్వాములకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు ఆనంద్ శర్మస్వామి, ప్రకాశం స్వామి, ఆంజనేయులు స్వామి, కన్య స్వాములు నాగభూషణం, రాజు, హరికృష్ణ గౌడ్, స్వాములు అభిలాష్ స్వామి, చెంద్రయ్య స్వామి లతో పాటు మాజీ సర్పంచ్ చిలుకంటి వెంకటేశం, నోమన్నగారి వెంకట్ రెడ్డి, శంకర్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవా సహిత అయ్యప్ప దేవాలయానికి డిజె సెట్ బహుకరణ




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం శ్రీ సత్యదేవా సహిత అయ్యప్ప దేవాలయం అయ్యప్ప దేవాలయానికి భజన మండలికి సంబంధించి చౌటుప్పల్ కు చెందిన కచరకుంట్ల వెంకటరెడ్డి గురుస్వామి 27వ శబరి యాత్ర సందర్భంగా సంబదిన 1పిన్ డీజే, మానిటర్, వైర్ లేష్ మౌత్, 4మౌతులు, 2డిక్కీలు, 3తాలలు, 2గజ్జలు దేవాలయ అధ్యక్షుడు కామిశెట్టి భాస్కర్ గురుస్వామికి బుధవారం అందజేశారు ఈ సందర్భంగా అధ్యక్షుడు కామిశెట్టి భాస్కర్ గురుస్వామి మాట్లాడుతు కంచరకుంట్ల వెంకట్ రెడ్డి గురుస్వామికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. గురుస్వామి కుటుంబానికి అయ్యప్ప స్వామి అనుగ్రహం ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు. దేవాలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బిళ్ల మురళి గురుస్వామి, ప్రధాన కార్యదర్శి చింతల సాయిలు గురుస్వామి, గురుస్వాములు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, ఉప్పు ఆంజనేయులు, బోరెం రాజశేఖర్ రెడ్డి, సుక్క సుదర్శన్, తిరందాస్ జగన్నాథం, గుంటోజు ఆంజనేయ చారి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజల హక్కులను హరించేందుకు
# కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తుంది

* **వామ పక్ష కార్మిక సంఘాల నాయకులు**




జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గంతో పాటు అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను, హక్కులను హరించేందుకు దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటున్నదని వామ పక్ష కార్మిక సంఘాల నాయకులు ఉమా మహేష్ , కీలుకానీ లక్ష్మణ్, అనురాధ లు అన్నారు. కేంద్ర కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపుమేరకు దేశవ్యాప్త ఆందోళనలలో భాగంగా జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం షాపూర్ నగర్ రైతు బజార్ నుండి ఉషోదయ టవర్స్ వరకు కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా వామపక్ష కార్మిక సంఘాల ఏఐటియుసి సిఐటియు ఐఎఫ్టియు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను తక్షణం మార్చాలని మోడీ మెడపై కార్పొరేట్లు కత్తి పెట్టారనీ, అందుకే ఎన్నో పోరాటాల ఫలితంగా సంభవించిన చట్టాలను లేకుండా చేస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు. ఇది అప్రజాస్వామిక చర్య అని చెప్పారు. ప్రజా, కార్మిక వ్యతిరేకమైన ఈ చర్యను మీడియా పట్టించుకోకపోవటం విచారకరమన్నారు. క్యాజువల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి, నియామకాలపై నిషేధాన్ని వెంటనే ఎత్తేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్రభుత్వ రంగం సంస్థలలో ఖాళీగా ఉన్న 65 లక్షల పోస్టులను భర్తీ చేయాలనీ, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలనీ, రిజర్వేషన్లను కాపాడటానికి ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఎస్సీ,ఎస్టీ, మైనారిటీలకు సామాజిక రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటిసి జిల్లా అధ్యక్షులు స్వామి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దేవదానం, ఐఎఫ్టియు జిల్లా నాయకురాలు పద్మ, అంజయ్య, శ్రీను, కనకయ్య, నరసింహారెడ్డి, మల్లయ్య, కరుణాకర్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు




## గ్రామ పంచాయతీ ఎన్నికలు
# సమర్థవంతంగా నిర్వహించాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. ఐ డి ఓ సి సమావేశ మందిరం నుండి బుధవారం డీ.ఎల్.పీ.ఓలు, ఎం.పీ. డీ.ఓలు, ఎం.పీ.ఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లను, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఏ దశలోనూ అలసత్వానికి తావు ఇవ్వకూడదని, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. నిఘా బృందాలను నియమించి, పకడ్బందీగా కోడ్ అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను ఎక్కడికక్కడ నిరోధించాలని, మద్యం, డబ్బు పంపకాలు, ఇతర ప్రలోభాలకు గురి చేసే వస్తువుల పంపిణీపై నిఘా ఉంచాలన్నారు. ఓటరు జాబితాను మరోమారు నిశితంగా పరిశీలించాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు గమనిస్తే తమ దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమిస్తూ, ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన కల్పించేలా శిక్షణ తరగతులను ఇప్పటికే నిర్వహించడం జరిగిందన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని జాగ్రత్తగా సరి చూసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ఎక్కడైనా సదుపాయాలు లేకపోతే యుద్ధప్రాతిపదికన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, టాయిలెట్స్, ఫర్నీచర్, విద్యుత్, లైటింగ్ వంటి వసతులు ఉండేలా చూసుకోవాలని అన్నారు. సర్పంచ్, వార్డు స్థానాల రిజర్వేషన్ల జాబితాను మరోమారు పరిశీలించుకోవాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర అన్ని ప్రక్రియలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన అంశాలపై, నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను గడువు లోపు పరిష్కరించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, డిప్యూటీ కలెక్టర్ మురళి, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డిపిఓ సుధీర్,అనూష, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలదారులకు
# నిత్య అన్న ప్రసాద వితరణ

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ 17వ రోజు నిర్వహించారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వామి మలాదారులకు పగిడోజు రామాచారి భాగ్యమ్మ దంపతుల కుమారుడు, కోడలు శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం ప్రధాన అర్చకులు సంతోష్ కుమార్ శాస్త్రి అశ్విని దంపతులు బుధవారం నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అన్న ప్రసాద దాతలు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు ప్రసాద వితరణ నిర్వహించడం తమ పూర్వ జన్మ సుకృతమని, తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అన్న ప్రసాద దాతల కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని, అయురూ ఆరోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ నిర్వాహకులు తొర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, చెవగోని మహేష్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, వరగంటి వెంకటేష్ గౌడ్, స్వాములు పోల్దాస్ రాజు, చెరుకు రాము గౌడ్, ఉష్కాగుల శ్రీశైలం గౌడ్, దాసరి మురళిస్వామి, చెవగోని గణేష్ గౌడ్, మార్గం శేఖర్ యాదవ్, బందారపు శివగౌడ్, అందోజు సన్నిధ్ చారి, అప్పిడి శేఖర్ రెడ్డి, బొడిగె భాను గౌడ్, చెరుకు చైతన్య, చందు గౌడ్, తొర్పునూరి సాయి, తొర్పునూరి సాయిలుగౌడ్, శివ ప్రసాద్ గౌడ్, కళ్యాణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

**– జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లాలో 0-5 సంవత్సరాలలోపు వయసుగల పిల్లల ఆధార్ నమోదు చేయించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం ఐడిఒసి కార్యాలయం సమావేశ మందిరంలో విద్య, గ్రామీణాభివృద్ధి, బ్యాంకు, పంచాయతీ, తపాలా, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 5 సంవత్సరాలలోపు గల పిల్లలందరి ఆధార్ నమోదు చేయించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఆధార్ నమోదు కేంద్రాలు పని చేయాలని, 5 సంవత్సరాలు, 15 సంవత్సరాలు దాటినవారు ఆధార్ బయోమెట్రిక్ చేయించుకోవాలని తెలిపారు. ఆధార్ లేని వారిని గుర్తించి నమోదు చేయించాలని తెలిపారు. జిల్లాలో మొత్తం ఆధార్ కార్డుల సంఖ్య 10,57,427 అని మిగిలిన వారిని అందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెలలో మొదటి వారంలో ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఆధార్ కార్డు లేని పిల్లల వివరాలను నివేదికలు తయారు చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఆధార్ కార్డు లేని పిల్లల వివరాలను సేకరించి నివేదికలు అందించాలని ఆదేశించారు. వచ్చే మార్చి నాటికి జిల్లా వ్యాప్తంగా అందరికీ ఆధార్ కార్డ్ తప్పనిసరిగా ఉండాలని, ఆ విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్చి 1వ తేదీ వరకు బయోమెట్రిక్ సవరణలను ఖచ్చితంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అనంతరం అవసరమైన చోట ఆధార్ క్యాంపులను నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కొంతమందికి రెండు ఆధార్ కార్డులు మంజూరు అయ్యాయని, దానివల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని ఆ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, డిప్యూటీ కలెక్టర్ మురళి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఈడియం సైదేశ్వర రావు, సంభంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈశాన్య రాష్ట్రాలకు
## వైద్య సహకారం అందిస్తాం

**: మంత్రి దామోదర్**



హైదరాబాద్: ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఎలాంటి వైద్య సహకారం కావాలన్నా అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈశాన్య రాష్ట్రాల ప్రజలు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో 'తెలంగాణనార్త్ ఈస్ట్ కనెక్ట్' కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన ఆరోగ్య సదస్సులో మంత్రి పాల్గొని మాట్లాడారు. ''రాష్ట్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్యాన్ని అందించడానికి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మిస్తున్నాం. హైదరాబాద్‌లో మూడు టిమ్స్, ఉస్మానియా కొత్త ఆసుపత్రితో పాటు వరంగల్‌లో హెల్త్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్నాం. 1,800లకు పైగా వైద్య సేవలు, సర్జరీలు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందిస్తున్నాం. రాష్ట్రాలు వేరైనా మనమంతా భారత దేశ పౌరులం. ప్రజలు ఎవరైనా అనారోగ్యం, అత్యవసర ఆపద వచ్చినప్పుడు మెరుగైన వైద్య సేవలు పొందాలని చూస్తారు. ఈశాన్య రాష్ట్రాలతో తెలంగాణ బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు కృతజ్ఞతలు'' అని మంత్రి పేర్కొన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో
## అన్ని గ్రామాల్లో పోటీ చేయాలి
**: రామచందర్‌రావు**



హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల బరిలో అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యర్థులను రంగంలోకి దించి అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఆయన అధ్యక్షతన బుధవారం దృశ్య మాధ్యమ సమావేశం జరిగింది. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్, భాజపా జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేసిన అభ్యర్థులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రాంచందర్‌రావు మాట్లాడుతూ..అన్ని గ్రామాల్లో పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ శ్రేణులు బలమైన మద్దతు అందించి, అత్యధిక స్థానాల్లో గెలిపించాలి. గ్రామాల అభివృద్ధికి నిధులిస్తుంది కేంద్ర ప్రభుత్వమే.

## నేతాజీ హై స్కూల్లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : భారత రాజ్యాంగ దినోత్సవం (సంవిధాన దివస్) సందర్భంగా బుధవారం సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీలో గల నేతాజీ హై స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠిక చదవడం విద్యార్థుల చర్చలు, వ్యాసా రచన పోటీలు క్విజ్ పోటీలు, రాజ్యాంగ హక్కులు, కర్తవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ చింతల మహేష్ కుమార్ మాట్లాడుతూ 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని సంవిధాన సభ అధికారికంగా ఆమోదించడం జరిగిందన్నారు. 2015లో భారత ప్రభుత్వం డా. బి.ఆర్. అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించింది అని విద్యార్థులలో రాజ్యాంగ విలువలను రాజ్యాంగ దినోత్సవం జరపడం వల్ల రాజ్యాంగానికి గౌరవం తెలిపారని అన్నారు. పౌరుల హక్కులు, కర్తవ్యాలు, ప్రభుత్వ నిర్మాణాన్ని నిర్వచించే అత్యున్నత చట్టాన్ని గుర్తు చేయటంతో ప్రజాస్వామ్య విలువలను విద్యార్థులకు తెలిపి న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి విలువలను వారిలో పెంపొందించేందుకు రకమైన కార్యక్రమాలు ఉపయోగపడతా యని వారు చెప్పారు. ఈ సందర్భంగా డా. అంబేద్కర్ తో పాటు రాజ్యాంగాన్ని రూపొందించిన సంవిధాన సభ సభ్యులకు నివాళిలు అర్పించారు. విద్యార్థులు అంబేద్కర్ గురించి చేసిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చింతల మహేష్‌కుమార్ అకాడమిక్ డైరెక్టర్ నందిని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు

## రికవరీ సొత్తు, రివాల్వర్ మాయం..
### ఎస్సైపై సస్పెన్షన్ వేటు



అంబర్‌పేట (హైదరాబాద్): దొంగతనం కేసులో స్వాధీనం చేసుకున్న బంగారాన్ని క్రైం ఎస్సై వడ్డీ వ్యాపారి వద్ద కుదువ పెట్టిన ఉదంతమిది. ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనానికి బానిసైన ఎస్సై డబ్బుల కోసం బంగారాన్ని కుదువపెట్టినట్లు విచారణలో తేలింది. సదరు ఎస్సై సర్వీస్ రివాల్వర్ పోయిన ఘటనపై విచారణ జరుగుతోంది. హైదరాబాద్ అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై పోలీస్ తూర్పు మండలం డీసీపీ బాలస్వామి వివరాల ప్రకారం... ఏపీలోని రాయచోటికి చెందిన భానుప్రకాష్ 2020 బ్యాచ్ ఎస్సైగా ఎంపికయ్యారు. నగరంలోని హిమాయత్‌నగర్‌లో నివాసం ఉంటున్న అతను గత కొన్నేళ్లుగా అంబర్‌పేట పోలీస్‌స్టేషన్లో పనిచేస్తున్నారు. కొంత కాలం సెక్టార్ ఎస్సైగా పనిచేసిన అతన్ని క్రైం విభాగం ఎస్సైగా మార్చారు. పటేల్‌నగర్‌లో ఇంటి పని మనిషి దొంగతనం కేసులో 4.3 తులాల దొంగసొత్తును స్వాధీనం చేసుకున్నారు. కోర్టు విచారణలో ఉన్న ఈ కేసు లోక్ అదాలత్‌లో పరిష్కారమైంది. దీంతో స్వాధీనం చేసుకున్న బంగారాన్ని యజమానికి అప్పగించే క్రమంలో అది కనబడటం లేదని తేలింది. విచారించిన అధికారులు ఆన్‌లైన్ బెట్టింగ్ డబ్బుల కోసం బంగారాన్ని నారాయణగూడలోని మార్వాడీ దుకాణంలో కుదువ పెట్టినట్లు వెల్లడైంది. ఈ మేరకు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతని సర్వీస్ రివాల్వర్ పోయిన విషయమై విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో అతన్ని నాలుగు రోజుల క్రితమే విధుల నుంచి తొలగించినట్లు (సస్పెండ్ చేసినట్లు) కాచిగూడ డివిజన్ ఏసీపీ హరీష్‌కుమార్ తెలిపారు.

### జనరల్ స్థానాలన్నింటిలో బీసీలు
## పెద్దఎత్తున నామినేషన్లు వేయాలి: కవిత



హైదరాబాద్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేయడంలో కాంగ్రెస్ పార్టీనే ప్రధాన ద్రోహి అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీసీలు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కులగణన మొదలు అన్నీ తప్పుల తడకగా చేసిందని, ఆ ప్రభావం పంచాయతీ ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కులగణన అంశాన్ని రాహుల్‌గాంధీ రాజకీయంగా వాడుకోవడానికి ప్రయత్నం చేశారు తప్ప.. తెలంగాణ ప్రజలపై చిత్తశుద్ధితో కాదని కవిత ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా చేయడంలో ప్రధాన దోషి భాజపా అని.. ఆ పార్టీ కనీసం నోరు విప్పడం లేదని, ఇంకో పార్టీ నిద్ర పోయి లేవడం లేదని విమర్శించారు. ప్రతిపక్షం గురించి తాను మాట్లాడబోనని, మాట్లాడితే టార్గెట్ చేస్తారని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాలన్నింటిలో బీసీలు పెద్దఎత్తున నామినేషన్లు వేయాలని కవిత పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జాగృతి జనం బాటలో మార్పులు చేసి కామారెడ్డి తర్వాత హైదరాబాద్‌లో చేస్తామని చెప్పారు.

## మరో కేసులో ఇమంది రవికి
### 14 రోజుల రిమాండ్



హైదరాబాద్: ఐబొమ్మ ప్రధాన నిర్వాహకుడు ఇమంది రవిని సైబర్ క్రైమ్ పోలీసులు మరోసారి కోర్టులో హాజరు పర్చారు. మరో కేసులో అతనికి నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఇమంది రవిపై ఇప్పటి వరకు సైబర్ క్రైమ్ పోలీసులు మొత్తం 5 కేసులు నమోదు చేశారు. మిగిలిన 3 కేసులకు సంబంధించి కూడా పీటీ వారెంట్ దాఖలు చేశారు. కోర్టు అనుమతితో ఆ మూడు కేసుల్లో కూడా అరెస్టు చూపనున్నారు. రవిని పోలీసు కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. 3 రోజుల పాటు ఇమంది రవిని పోలీసు కస్టడీకి అప్పగిస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే 5 రోజుల పాటు రవిని పోలీసులు కస్టడీకి తీసుకొని విచారించిన విషయం తెలిసిందే.

### గ్లోబల్ సమ్మిట్ ప్రారంభోత్సవానికి
## ప్రధాని మోదీని ఆహ్వానించాలి: సీఎం రేవంత్



హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్రమోదీని ఆహ్వానించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. డిసెంబరు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. ఆహ్వానితులకు ఎక్కడా లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకునే విషయంలో ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలని సీఎం చెప్పారు. ఇప్పటి వరకు 2,600 మందిని ఆహ్వానించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. సమ్మిట్‌లో సంక్షేమం, వైద్యం, పరిశ్రమలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర విభాగాల స్టాల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. సమ్మిట్‌లో స్టాల్స్ ఏర్పాటుకు సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ప్లీనరీలో విభాగాల వారీగా వివిధ అంశాలపై మాట్లాడేందుకు వక్తలకు సంబంధించిన పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఒక్కో ఈవెంట్‌కు సీనియర్ ఐఏఎస్ అధికారికి బాధ్యత అప్పగించాలని సీఎం సూచించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా డ్రోన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన డిజైన్లన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### మున్సిపాలిటీల విలీన ప్రక్రియపై
## సమగ్ర అధ్యయనం

జీహెచ్ఎంసీలో తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టీసీయూఆర్) ప్రాంతం వరకు విస్తరించాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతోపాటు ఈ అంశాన్ని జీహెచ్ఎంసీ జనరల్ బాడీ సమావేశం సైతం ఆమోదించింది. 27 మున్సిపాలిటీలను విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించిన ప్రభుత్వం దీనిపై సమగ్రంగా అధ్యయనం చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించింది. అయితే జీహెచ్ఎంసీలో పాలకవర్గం ఉండడం, 27 మున్సిపాలిటీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన ఉండడంతో విలీనానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీచేసే అవకాశంలేదని మున్సిపల్ శాఖ సీనియర్ అధికారులు, ప్రణాళిక విభాగం నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**విలీనంపై అధ్యయనం...**
జీహెచ్ఎంసీలో 27మున్సిపాలిటీల విలీనంపై అధికారులు అధ్యయనం చేయాలని నిర్ణయించారు. అయితే 2020లో సంభవించిన భారీ వరదల తర్వాత నుంచి ఈ మున్సిపాలిటీల్లో డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు పనులను జీహెచ్ఎంసీ ఇంజినీర్ల ఆధ్వర్యంలో చేపడుతున్నారు. స్ట్రీట్ లైట్ల నిర్వహణకు సైతం వీటికి జీహెచ్ఎంసీతోపాటే టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాగునీటి సరఫరా సైతం జలమండలి ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. వీటితోపాటు డ్రెయినేజీ వ్యవస్థ, వరదనీటి కాలువల వ్యవస్థ, రోడ్డు నెట్ వర్క్, ఆఫీసులు, ఆస్తులు, ఆదాయాలు, ఖర్చులు, ఉద్యోగుల వివరాలను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి రిపోర్టు ఇవ్వనున్నారు.

**అసెంబ్లీలో చర్చ...**
27మున్సిపాలిటీల విలీనం గురించి డిసెంబర్‌లో జరిగే శీతాకాల సమావేశాల్లో చర్చించనున్నారు. కేబినెట్ సమావేశం ఆమోదించి అసెంబ్లీలో చర్చకు పెట్టనున్నట్టు అధికారులు చెబుతున్నారు. అన్ని పార్టీల నుంచి అభిప్రాయాలు తీసుకోవడంతోపాటు సలహాలు, సూచనలు, అభ్యంతరాలను కూడా స్వీకరించాలని సర్కార్ నిర్ణయించినట్టు సమాచారం.

**ఫిబ్రవరి10వ తేదినే....**
జీహెచ్ఎంసీ పాలకవర్గం గడువు 10 ఫిబ్రవరి 2026న ముగియనుంది. అదే రోజు సాయంత్రం స్పెషల్ ఆఫీసర్ పాలనకు సంబంధించిన ఉత్తర్వులు కూడా జారీచేసే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు జీహెచ్ఎంసీలో పాలకవర్గం ఉండడం, 27మున్సిపాలిటీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన ఉండడంతోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసే అవకాశంలేదని న్యాయ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గం గడువు ముగియగానే అటు స్పెషల్ ఆఫీసర్ పాలన, ఇటు 27 మున్సిపాలిటీల విలీనానికి సంబంధించిన ఉతర్వులు వెలువడే అవకాశాలున్నాయని, ఆ రోజు నుంచే మున్సిపాలిటీల్లోని స్పెషల్ ఆఫీసర్ల ముగియనుందని అధికారులు చెబుతున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పవర్‌స్కామ్‌కు తెరలేపింది: హరీశ్‌రావు




హైదరాబాద్:కాంగ్రెస్ప్రభుత్వం దాదాపు రూ.50వేల కోట్ల పవర్‌స్కామ్‌కు తెరలేపిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇందులో పవర్ ప్లాంట్ల ఏర్పాటుతో 30, 40శాతం కమీషన్లు తీసుకునేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. ''రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏం చేసినా ఒక మిషన్ ఉంటుంది.. ఆ మిషనే కమీషన్. కమీషన్లు ఎలా కొల్లగొట్టాలి అని మాత్రమే ఆయన ప్రభుత్వం ఆలోచిస్తోంది. వాటాల పంపిణీ విషయంలో మంత్రులు ఘర్షణ పడుతున్నారు. మంత్రుల కుటుంబ సభ్యులే బయటకు వచ్చి వాటాల అంశంపై చెబుతున్నారు. రాష్ట్రాన్ని అరాచకాలకు కేంద్రంగా కాంగ్రెస్ ప్రభుత్వం మారుస్తోంది. కొత్తగా పాల్వంచ, రామగుండం, మక్తల్‌లో 2,400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి రూ.50వేల కోట్లు అవసరం. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.10వేల కోట్లు చెల్లించాలి. అప్పుగా రూ.40వేల కోట్లు తేవాలి. ఈ అప్పు ఎక్కడి నుంచి తెస్తారు?''అని హరీశ్‌రావు నిలదీశారు.

## హైదరాబాద్‌లో నకిలీ ఐపీఎస్ .. గన్‌మెన్లతో హంగామా



ఆసిఫ్‌నగర్ (హైదరాబాద్): పోలీసు విభాగంలో ఏదైనా పని ఉంటే ఐపీఎస్, ఎన్ఐఏ అధికారి.. ఇతర ప్రభుత్వ విభాగాల్లో పనికోసం ఐఏఎస్‌గా అవతారమెత్తి ప్రజలను మోసగిస్తున్న వ్యకిని ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీగార్డ్స్‌లోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పశ్చిమ మండలం డీసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. చంపాపేటకు చెందిన బత్తిని శశికాంత్ (39) 3డి ఏనిమేషన్ కోర్సు చేసి చిన్న కంపెనీ ఏర్పాటు చేశాడు. ఇతని స్వస్థలం ఏపీలోని ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు. ఇటీవల షేక్‌పేటలోని అపర్ణ ఔరా అపార్టుమెంట్‌కు మకాం మార్చాడు. నేర్చుకున్న ఏనిమేషన్ కోర్సును ఉపయోగించి తన పేరిట నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్ఐఏ అధికారుల గుర్తింపు కార్డులు తయారు చేశాడు. పోలీసు, ఎన్ఐఏలో ప్రత్యేక ఆపరేషన్ల కోసం తనను ప్రభుత్వం నియమించిందని నమ్మబలుకుతూ తిరుగుతుండేవాడు. తమిళనాడుకు చెందిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను గన్‌మెన్లుగా నియమించుకున్నాడు. గన్‌మెన్లతో కలిసి షేక్‌పేటలోని గోల్డ్ జిమ్‌కు వెళ్లేవాడు. కసరత్తు చేస్తున్న సమయంలో ఫోన్ రింగ్‌కాగా ప్రత్యేక ఆపరేషన్‌కు వెళుతున్నానంటూ హడావిడిగా జిమ్ నుంచి బయటికి వెళ్లేవాడు. ఈనేపథ్యంలో టీఎస్ఐఐసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, ఖాళీ స్థలాలు కేటాయించే విభాగానికి ప్రత్యేక ఐఏఎస్ అధికారినంటూ జిమ్ ఎండీ అలీ హసన్‌కు చెప్పాడు. పరిశ్రమ స్థాపన కోసం స్థలం కేటాయింపు జరిగిదంటూ నకిలీ అలాట్‌మెంట్ ఆర్డర్ తయారు చేసి అలీ హసన్‌కు చూపించి, రూ.10.50 లక్షల నగదు బ్యాంకు నుంచి బదిలీ చేయించుకున్నాడు. జిమ్‌కు వచ్చే మరో వ్యక్తి నుంచి రూ.10లక్షలు వసూలు చేశాడు. కేటాయింపు జరిగిందని చూపించిన స్థలం తన పేరుపై బదిలీ కాకపోవడంతో అలీ హసన్‌కు ఇతని ప్రవర్తనపై అనుమానం వచ్చి ఫిల్మ్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శశికాంత్‌ను అరెస్టు చేసి రెండు చరవాణులు, ఆరు సిమ్‌కార్డులు, రెండు వాకీటాకీలు, నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్ఐఏ అధికారుల గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇతనికి గన్‌మెన్లుగా వ్యవహరించిన తమిళనాడుకు చెందిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను అరెస్టు చేయాల్సి ఉందని డీసీపీ శ్రీనివాస్ చెప్పారు.

# రబ్రీ దేవీ ఆ బంగ్లాను ఖాళీ చేసే ప్రసక్తే లేదు: ఆర్జేడీ

బిహార్ మాజీ సీఎం, లాలూప్రసాద్ యాదవ్ సతీమణి రబ్రీ దేవీ (Rabri Devi) రెండు దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేసే ప్రసక్తే లేదని ఆర్జేడీ స్పష్టం చేసింది. వేరే నివాసంలోకి మారాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన మరుసటి రోజు ఈమేరకు స్పందించింది. లాలూకు వ్యతిరేకంగా అధికార ఎన్డీయే దురుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంగనీ లాల్ మండల్ ఆరోపించారు. పట్నాలో ముఖ్యమంత్రి అధికారిక నివాసం '1, అన్నే మార్గ్' సమీపంలోని 10, సర్క్యులర్ రోడ్ బంగళాలో రబ్రీ దేవీ రెండు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. అయితే, శాసన మండలిలో ప్రతిపక్ష నాయకురాలి హోదా కింద 39, హర్డింగ్ రోడ్ నివాసంలోకి మారాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏదేమైనా ప్రస్తుత నివాసాన్ని రబ్రీ దేవీ ఖాళీ చేయబోరని మంగనీ లాల్ మండల్ మీడియాకు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రులకు జీవితాంతం నివాసం కేటాయించాలనే పాత నిబంధన ప్రకారం గతంలో ఆ బంగళాను రబ్రీ దేవీకి కేటాయించినట్లు మంత్రి సంతోష్‌కుమార్ సుమన్ వెల్లడించారు. కొన్నేళ్ల క్రితం అలహాబాద్ హైకోర్టు తీర్పు అనంతరం ఆ నిబంధన రద్దయిందన్నారు. ఇప్పుడు కూడా మాజీ ముఖ్యమంత్రికి బంగ్లాను నిరాకరించలేదని చెప్పారు. ఏ నివాసాన్ని ఎవరికి కేటాయించాలో నిర్ణయించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. అయితే, శాసన మండలిలో ప్రతిపక్ష నేతకు ప్రభుత్వ బంగ్లా కేటాయించేందుకు సీఎం నీతీశ్ కుమార్ రెండు దశాబ్దాలపాటు ఎందుకు వేచి చూశారని మంగనీ లాల్ ప్రశ్నించారు. ప్రస్తుతం ఉంటున్న నివాసాన్నే ఎందుకు కేటాయించలేదన్నారు. భాజపాను ప్రసన్నం చేసుకునేందుకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆరోపించారు. లాలూ యాదవ్, రబ్రీ దేవీ ఇద్దరూ ముఖ్యమంత్రులుగా



పనిచేశారనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

## ఉగ్రవాదాన్ని ఉసిగొల్పడం పాక్ మానదు పంకజ్ సరన్

భారత్‌పై ఉగ్రవాదాన్ని ఉసిగొల్పడం పాకిస్థాన్ ఎన్నటికీ వదిలిపెట్టదని మాజీ డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్, ఎన్ఎస్ఏ బోర్డు సభ్యుడు పంకజ్ సరన్ పేర్కొన్నారు. కేవలం ఉగ్ర స్థావరాలు మారుస్తూ కొత్త విధానాలు, సాంకేతికతలను ఉపయోగిస్తుందన్నారు. 26/11 ముంబయి దాడులకు 17 సంవత్సరాలైన నేపథ్యంలో పీటీఐ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పంకజ్ ఈ విధంగా మాట్లాడారు. "ఉగ్రదాడులు చేస్తేనే భారత్‌ను అడ్డుకోగలమన్న అభిప్రాయానికి పాకిస్థాన్ వచ్చినట్లు మన అధ్యయనాలు చెబుతున్నాయి. తనకు తెలిసిన అన్ని కుయుక్తులను పాకిస్థాన్ అనుసరిస్తుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత వాళ్లు వ్యూహాలు మార్చుకుంటారు. ఉగ్ర స్థావరాలను, క్యాంపులను మారుస్తారు. కొత్త సాంకేతికతను, విభిన్న విధానాలను అనుసరిస్తారు. 1947



నుంచి భారత్ ప్రతిస్పందన తీరులో గణనీయమైన మార్పు వచ్చింది. తొలుత మనం ఐరాసకు వెళ్లాం. అనంతరం దౌత్యపరమైన నిరసనలు చేశాం. ఆ తర్వాత ఆపరేషన్ పరాక్రమ్ చేపట్టినప్పటికీ యుద్ధం జోలికి పోలేదు. కానీ, నేడు పాకిస్థాన్ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని యుద్ధ చర్యగా పరిగణిస్తూ ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నాం" అని మాజీ దౌత్యవేత్త పంకజ్ సరన్ వివరించారు.

# ఇతరులకు ఉపదేశాలు ఇవ్వడం కాదు..!

## పాక్‌కు భారత్ చురకలు

అయోధ్య రామమందిరం ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొనడంపై పాకిస్థాన్ చేసిన విమర్శలను భారత్ తీవ్రంగా ఖండించింది. మైనార్టీలను అణచివేతకు గురిచేసే చరిత్ర కలిగిన దేశానికి ఇతరులకు ఉపదేశాలు ఇచ్చే నైతికత లేదని దుయ్యబట్టింది. కపట ఉపన్యాసాలు ఇచ్చే బదులు అంతర్గత వ్యవహారాలను చక్కబెట్టుకోవాలంటూ దాయాదికి చురకలు అంటించింది. "పాక్ చేసిన విమర్శలు మా దృష్టికి వచ్చాయి. వాటిని పూర్తిగా తిరస్కరిస్తున్నాం. మతతత్వం, అణచివేత, మైనార్టీలపై దురుసు ప్రవర్తన కలిగిన చరిత్ర



వారిది. ఇతరులకు ఉపన్యాసాలు ఇచ్చే నైతికత పాక్‌కు లేదు. ఇలాంటి ఉపదేశాలు ఇచ్చే బదులు.. అంతర్గత వ్యవహారాలు, దారుణమైన మానవ హక్కులపై దృష్టి పెట్టుకోవాలి" అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ పేర్కొన్నారు.

**బంగ్లా అభ్యర్థనను పరిశీలిస్తున్నాం**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ప్రధాని షేక్ హసీనా అప్పగింతకు సంబంధించిన అంశాన్ని పరిశీలిస్తున్నామని భారత్ పేర్కొంది. ఆ దేశంలో శాంతి, ప్రజాస్వామ్యంతోపాటు అక్కడి ప్రజల ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. ఈ విషయంలో భాగస్వామ్య పక్షాలతో నిర్మాణాత్మక సంప్రదింపులు కొనసాగిస్తామని విదేశాంగ అధికార ప్రతినిధి తెలిపారు.

# రెండు కోట్ల ఆధార్ ఐడీలు డీయాక్టివేట్..

దిల్లీ: ఆధార్ డేటాబేస్‌లోని అదనపు వివరాలను తొలగించేందుకు 'యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా' దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో దాదాపు రెండు కోట్ల మంది చనిపోయిన వ్యక్తుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసింది. ఆధార్ సమాచారం ఎప్పటికప్పుడు తాజాగా, కచ్చితంగా ఉండేలా ఈ 'క్లీన్‌అప్' కార్యక్రమాన్ని చేపట్టింది. చనిపోయిన వారి ఆధార్‌ను దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవడానికి, లేదా దాన్ని ఉపయోగించి సంక్షేమ పథకాల ప్రయోజనాలను అనధికారికంగా పొందకుండా నివారించడానికి ఈ చర్యలు చాలా అవసరం. ఏ ఆధార్ నంబర్‌ను కూడా మరొకరికి మళ్లీ కేటాయించరు. మృతుల వివరాలు సేకరించేందుకు UIDAI అనేక మార్గాలను ఉపయోగిస్తోంది. ముఖ్యంగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (RGI), రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS), జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (NSAP) వంటి కేంద్ర ప్రభుత్వ




విభాగాల నుంచి మరణించిన వారి డేటాను సేకరిస్తోంది. భవిష్యత్తులో ఈ వివరాల కోసం ఆర్థిక సంస్థలు సహా ఇతరత్రా విభాగాలతో కూడా కలిసి పనిచేయాలని చూస్తోంది. కుటుంబ సభ్యులు కూడా చనిపోయిన తమవాళ్ల సమాచారాన్ని UIDAIకి తెలియజేసే వెసులుబాటు ఉంది. ఈ ఏడాది ప్రారంభంలో 'myAadhaar పోర్టల్'లో ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తమ వివరాలను నమోదు చేసుకుని, ఆ తర్వాత మరణించిన వ్యక్తి ఆధార్ నంబర్, మరణ ధ్రువీకరణ పత్రం సంఖ్యతో పాటు ఇతర వ్యక్తిగత వివరాలను పోర్టల్‌లో నమోదు చేయొచ్చు. కుటుంబ సభ్యులు అందించిన సమాచారాన్ని సరిచూసిన తర్వాత ఆ చనిపోయిన వ్యక్తి ఆధార్ నంబర్‌ను డీయాక్టివేట్ చేయడానికి తదుపరి చర్యలు తీసుకుంటారు.



## చార్‌ధామ్ యాత్రలో

# 51 లక్షల మందికిపైగా భక్తులు!

ఈ ఏడాది చార్‌ధామ్ యాత్రలో 51 లక్షలమందికిపైగా భక్తులు పాల్గొన్నారు. అత్యధికంగా 17.68 లక్షల మంది కేదార్‌నాథ్‌ను సందర్శించినట్లు పర్యాటక శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బద్రీనాథ్ (16.60 లక్షలు), గంగోత్రి (7.58 లక్షలు), యమునోత్రి (6.44 లక్షలు) మిగతా స్థానాల్లో నిలిచాయి. మంగళవారం బద్రీనాథ్ ఆలయ ద్వారాల మూసివేతతో ఈ ఏడాది యాత్రకు ముగింపు పలికినట్లయ్యింది. ఆ సమయంలోనూ ఏడు వేలమందికిపైగా భక్తులు అక్కడ ఉన్నారు. మిగతా మూడు ఆలయాలను గత నెలలోనే మూసివేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైంది. అధిక వర్షపాతం, వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తుల కారణంగా తీర్థయాత్రకు పదే పదే అంతరాయం కలిగింది. అయినప్పటికీ.. 51 లక్షల మందికిపైగా యాత్రికులు సందర్శించారు. ఇందులో హేమకుండ్ సాహిబ్‌ను సందర్శించిన 2.74 లక్షల మంది యాత్రికులు కూడా ఉన్నారు. గత ఏడాది 48 లక్షల మందితో పోలిస్తే ఈసారి మూడు లక్షలమందికిపైగా అధికంగా తరలివచ్చారు. యాత్రికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల కారణంగా ఈ సంఖ్య పెరిగిందని అధికారులు తెలిపారు.

## చొరబాటుదారులు

# క్యాన్సర్‌లాంటివారు..

**: కంగనా రనౌత్**

బాలీవుడ్ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్.. చొరబాటుదారులను క్యాన్సర్‌తో పోల్చారు. వారిని దేశం నుంచి బహిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ'ను వ్యతిరేకిస్తూ.. భాజపాను ఉద్దేశించి సీఎం మమతా బెనర్జీ చేసిన విమర్శలపై ఈ మేరకు స్పందించారు. "ఇటువంటి బెదిరింపులకు దేశం భయపడదు. చొరబాటుదారులను తొలగించాలని అందరూ కోరుకుంటున్నారు. వీరంతా శరీరంలో క్యాన్సర్ లాంటివారు. వారిని సాగనంపాల్సిందే" అని కంగనా రనౌత్ దిల్లీలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. అయోధ్య రామాలయం ధ్వజారోహణ కార్యక్రమంపై పాకిస్థాన్ విదేశాంగశాఖ చేసిన ప్రకటనపైనా మండిపడ్డారు. "రోజురోజుకూ పరిస్థితులు దిగజారుతుండటంతో పాక్ భయపడుతోంది. ఆ దేశం ఓ భిక్షాటన పాత్రగా మారింది. భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. త్వరలో మరింత ముందుకెళ్లనుంది"



అని పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మమతా బెనర్జీ మంగళవారం పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. ఎన్నికల సంఘం 'భాజపా కమిషన్'గా మారిందని ఆరోపించారు. తనను లక్ష్యంగా చేసుకుని రాజకీయంగా దెబ్బకొట్టాలని చూస్తే... దేశవ్యాప్తంగా భాజపా పునాదులను కదిలిస్తానని ధ్వజమెత్తారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితా బయటకు వచ్చిన తర్వాత.. ఈసీ, భాజపా సృష్టించిన గందరగోళాన్ని ప్రజలు గుర్తిస్తారని తెలిపారు.

## సైన్యంలో కొరత..

# ఏటా లక్ష మంది 'అగ్నివీర్'లను తీసుకోనున్నారా?

త్రివిధ దళాల్లో బలగాల కొరతను భర్తీ చేసేందుకు రానున్న రోజుల్లో నియామకాలను పెంచే యోచనలో భారత సైన్యం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రతి ఏడాది 45 వేల నుంచి 50 వేల మందిని నియమించుకుంటుండగా.. ఈ సంఖ్యను లక్షకు పెంచే ఆలోచనలో ఉన్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. కరోనా మహమ్మారి సమయంలో రెండేళ్ల పాటు నియామకాలు నిలిపివేయడమే ఈ కొరతకు కారణంగా తెలుస్తోంది. కరోనా సమయంలో 2020, 2021లో రెండేళ్లపాటు సైన్యంలో నియామకాలు నిలిచిపోయాయి. అదే సమయంలో ఏడాదికి 60వేల నుంచి 65 వేల మంది సైనికులు పదవీవిరమణ చేశారు. ఆ తర్వాత (నాలుగేళ్ల సమయానికి) 2022లో అగ్నిపథ్ పథకం ప్రారంభమైంది. భారీ స్థాయిలో నియామకాలు చేపట్టేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. ఆ ఏడాది త్రివిధ దళాల్లో దాదాపు 46వేల ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేసింది. కేంద్ర ప్రభుత్వం గతంలో వెల్లడించిన వివరాలను పరిశీలిస్తే 2023లోనే త్రివిద దళాల్లో 1.55లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సైన్యంలో ఏటా పదవీ విరమణలకు, నియామకాలకు మధ్య వ్యత్యాసం ఉండటంతో భారీ స్థాయిలో ఖాళీలు ఏర్పడుతున్నట్లు సమాచారం. ఇటీవల ఏడాదికి దాదాపు 20 నుంచి 25 వేల ఖాళీలు ఉంటుండడంతో ప్రస్తుతానికి 1.8లక్ష ఖాళీలు ఏర్పడినట్లు అంచనా. ఓ జాతీయ మీడియా కథనం ప్రకారం అగ్నిపథ్ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 1.75లక్షల



మంది అగ్నివీరులను నియమించుకున్నట్లు తెలిసింది. అయితే, అగ్నివీరుల నాలుగేళ్ల వ్యవధి వచ్చే ఏడాదితో పూర్తి కానుంది. వీరిలో అనేక మందితోపాటు రెగ్యులర్ సైనికులు కూడా పదవీవిరమణ చేయాల్సి రానుండడంతో రానున్న రోజుల్లో ఖాళీలు భారీగా పెరుగుతాయి. ఈ నేపథ్యంలో వీటిని భర్తీ చేసేందుకు ఏడాదికి లక్ష మంది అగ్నివీరులను నియమించుకోవాలని భారత సైన్యం యోచిస్తున్నట్లు సమాచారం. శిక్షణా కేంద్రాల్లో మౌలిక వసతులను దృష్టిలో ఉంచుకొని ఈ అదనపు నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# ముంబయిలో కాలుష్యం.. రోహిత్ శర్మ సతీమణి పోస్ట్ వైరల్

ముంబయి నగరంలో వాతావరణ కాలుష్యం తీవ్ర స్థాయిలో పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. దేశ రాజధాని దిల్లీ తర్వాత ఇప్పుడు వాణిజ్య రాజధాని ముంబయిని కూడా ఈ సమస్య చుట్టుముట్టింది. ముఖ్యంగా గాలి నాణ్యత సూచీ (AQI) 300 మార్కును దాటడం నగరవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ పరిస్థితిపై భారత క్రికెటర్ రోహిత్ శర్మ సతీమణి రితికా సజ్దే ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో ఈ విషయం మరింత చర్చనీయాంశమైంది. పెరుగుతున్న ఈ కాలుష్యంపై నగర ప్రజలు సామాజిక మాధ్యమాల్లో తమ ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. రితికా సజ్దే తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ముంబయిని కమ్మేసిన దట్టమైన పొగను పోస్ట్ చేసింది. 'AQI: 257. ఏం జరుగుతోంది?' అని ప్రశ్నిస్తూ, విషాదాన్ని సూచించే ఎమోజీని జత చేసింది. సామాన్య ప్రజలు కూడా ఈ కాలుష్యం గురించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఆమె పోస్ట్‌ను షేర్ చేస్తూ ఒక నెటిజన్, 'ముంబయి AQI 257గా ఉంటే, రోహిత్ శర్మ భార్య మాట్లాడారు. ఇప్పుడు దిల్లీ సెలబ్రిటీలు కూడా తమ గళం వినిపించాలి. ఈ కాలుష్యం మనల్ని చంపుతోంది. ఇప్పుడే మాట్లాడండి' అని కోరారు. మరొక వ్యక్తి ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. 'రోజూ 120 మంది పిల్లలు శ్వాసకోశ సమస్యలతో ఆసుపత్రిలో చేరుతున్నారు! ఇది అత్యవసర పరిస్థితి కాకపోతే మరేంటి?' అని ప్రశ్నించారు. బోరివలిలో ఒక ఫ్లాట్ ధర రూ.కోటి నుంచి ప్రారంభమవుతోందని.. కానీ గాలి నాణ్యత మాత్రం దారుణంగా ఉందని మరో వ్యక్తి వాపోయారు.

# వయ్యారికి ఫ్యూజన్ వడ్డాణం..!

**అమ్మాయిల నడుము వంపుల్లో అందంగా అమరిపోయి... ఆకట్టుకునే ఆభరణం వడ్డాణం. అందుకే, సంప్రదాయంగా కనిపించాలనుకున్నప్పుడు పట్టు చీరకట్టినా, లంగాఓణీ వేసినా... ఫైనల్ టచ్ ఇచ్చేది వడ్డాణంతోనే! వీటిల్లో అష్టలక్ష్మి రూపాలు, ఏనుగులూ, కలువలూ చేర్చిన టెంపుల్ స్టైల్ డిజైన్‌లు, ముత్యాల గొలుసులతో చేసిన సింపుల్ రకాలు... ఇలా ఎన్నెన్నో అలరిస్తూనే ఉన్నాయి. మరి ఇప్పుడు కొత్తదనం ఏంటనేగా మీ సందేహం. సాదా వడ్డాణానికి పాశ్చాత్య శైలిని పోలి ఉండేలా బెల్ట్ మాదిరిగా కనిపించడమే వీటి ప్రత్యేకత. అందుకే, ఈ తరం... ఈ ఫ్యూజన్ స్టైల్ వడ్డాణాన్ని తెగ మెచ్చేస్తున్నారు. మీరూ వాటిని చూసేయరిండి.**















# నూనెను నీళ్లలా వాడితే..!

**సాధారణంగా అందరూ ఆరోగ్యకరమైన ఆహారం గురించే మాట్లాడతారు. కానీ, ఆరోగ్యకరంగా ఆహారం వండడం గురించి ఎక్కువగా మాట్లాడరు. ఈ క్రమంలో హెల్దీ కుకింగ్‌లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది నూనె వాడకం. సాధారణంగా మన వంటల్లో నూనె కొంచెం ఎక్కువగానే ఉంటుంది. మనకు తెలియకుండానే తీసుకునే ఈ ఆయిల్ వల్ల ఎన్నో రకాల అనారోగ్య సమస్యలుఎదురవుతాయి.ఈక్రమంలో ఆయిల్ వాడకానికి సంబంధించి కొన్ని జాగ్రత్తలు పాటించక తప్పదు అంటున్నారు నిపుణులు.**



నూనె లేని వంటలు ఆరోగ్యానికి మంచివని తెలిసినా... వంటకానికి మంచి రుచి కావాలంటే గిన్నెలో ఆయిల్ పడాల్సిందే. అయితే నూనెను ఎలా పడితే అలా నీళ్లలా వాడితే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో నూనె వాడకంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే రుచికరమైన ఆహారంతో పాటు ఆరోగ్యమూ సొంతమవుతుంది.

**నూనెను తగ్గిద్దామిలా!**

* వేపుళ్ల బదులు బేకింగ్, స్టీమింగ్‌కు ప్రాధాన్యమివ్వండి. దీంతో ఆయా విటమిన్లు శరీరానికి పుష్కలంగా అందుతాయి.
* ఫ్రైడ్ స్నాక్స్‌కి బదులు స్టీమ్ చేసిన స్నాక్స్‌ను తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది.
* నూనెలు కాస్త తక్కువగా వాడేవారు... వంటలో పొరపాటున కాస్త ఎక్కువైతే తినడానికి ఇబ్బంది పడతారు. ఇలాంటప్పుడు నూనెను కొలత ప్రకారం వాడుకోవడమే పరిష్కారం. ఇందులో భాగంగా డైరెక్ట్‌గా బాటిల్‌లో నుంచి నూనెను పోసే బదులు మెజరింగ్ స్పూన్ లాంటి వాటితో వేయండి. అప్పుడు ఎంత నూనె వాడుతున్నారో తెలుస్తుంది.



* ఎప్పుడూ ఒకే నూనెను కాకుండా కాంబినేషన్ ఆయిల్స్‌ను వాడితే మంచిది. సన్‌ఫ్లవర్, రైస్ బ్రాన్, నువ్వులు,వేరుశెనగ,కొబ్బరి నూనెల్లో ఉండే మోనోశ్యాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, పాలీ అన్‌శ్యాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ మన బాడీకి చాలా అవసరం. మన శరీరం వాటిని స్వయంగా తయారుచేసుకోలేదు. వంట నూనె ద్వారానే అవి శరీరానికి అందుతాయి. అందుకే వేరు వేరు నూనెల్ని కలిపి వాడుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు.
* నూనె వినియోగానికి సంబంధించి నెలకు ఎంత వాడుతున్నామో ఒక లెక్క వేసి చూసుకోండి. అప్పుడు మీకు కూడా ఒక అవగాహన వస్తుంది. దీన్ని బట్టి అవసరం అనుకుంటే ఈ టిప్స్ ద్వారా నూనె వాడకాన్ని తగ్గించవచ్చు.
* వేపుళ్లకి వాడిన నూనెని మళ్లీ వేయించడానికి ఉపయోగించకండి. ఇందువల్ల శరీరంలోకి టాక్సిన్స్ చేరే ప్రమాదం ఉంది.

**ఇవి కూడా పాటించండి!**

* వంట నూనెను ఎక్కువసేపు వేడి చేస్తే అందులో ఉండే విటమిన్లు శరీరానికి అందవు. అంతేకాదు... ఒకసారి వాడిన నూనెను ఎక్కువసార్లు వాడకూడదు.
* ఎట్టి పరిస్థితుల్లోనూ ఇప్పటికే వాడిన నూనెతో తాజా నూనెను కలపకండి.
* నూనెను వేడి చేసినప్పుడు దాని టెంపరేచర్ కూడా మారుతుంది. ఏ టెంపరేచర్ వద్ద నూనె పొగ రావడం మొదలు పెడుతుందో దానిని 'స్మోకింగ్ పాయింట్' అంటారు. దీనిపై కొంచెమైనా అవగాహన కలిగి ఉండాలి. ప్రత్యేకించి ఫ్రై చేయాల్సిన అవసరం వస్తే ఎక్కువ స్మోకింగ్ పాయింట్ ఉన్న నూనెను మాత్రమే వాడాలి.
* వంట నూనెపై సూర్యరశ్మి పడకుండా చూడాలి. నేరుగా ఎండ పడడం వల్ల నూనెలో కొన్ని రసాయనిక మార్పులు జరిగే అవకాశం ఉంది.
* వంట నూనె కొనే ముందు అందులో ఉన్నకొవ్వు శాతం చూసి మరీ కొనాలి. నిర్ణీత మోతాదు కన్నా ఎక్కువ ఉంటే ఆరోగ్యానికి ప్రమాదకరం అంటున్నారు నిపుణులు.



## ఏఐ ఎఫెక్ట్.. హెచ్‌పీలో భారీగా లేఆఫ్స్



**న్యూఢిల్లీ:** ప్రపంచ వ్యాప్తంగా లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. పెద్ద పెద్ద టెక్ కంపెనీలు భారీ స్థాయిలో ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి. గూగుల్, మెటా, ఇన్ఫోసిస్, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలు ఇప్పటికే పెద్ద మొత్తంలో ఉద్యోగులను తొలగించాయి. కరోనా తర్వాత ఆర్థిక మాంద్యం భయాలతో మొదలైన ఈ ప్రక్రియ.. ఇప్పుడు కృత్రిమ మేధ వైపు మళ్లుతోంది. కృత్రిమ మేధని అందిపుచ్చుకునేందుకు సంస్థలు కోతలకు తెగబడుతున్నాయి.

తాజాగా ప్రపంచ ప్రఖ్యాత పీసీ, ప్రింటర్ల తయారీ సంస్థ హెచ్‌పీ కూడా పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించింది. 2028 నాటికి ప్రపంచవ్యాప్తంగా 6 వేల మంది ఉద్యోగులను తొలగించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ సంఖ్య కంపెనీలోని మొత్తం ఉద్యోగుల్లో సుమారు 10-12 శాతంగా ఉంటుందని అంచనా. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఇంటర్నల్ ఆపరేషన్స్, కస్టమర్ సపోర్ట్ వంటి విభాగాల్లో ఈ కోతలు ఉండనున్నట్లు సంస్థ సీఈఓ ఎన్రిక్ లారెస్ వెల్లడించారు. 2024 అక్టోబరు నాటికి హెచ్‌పీకి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 58వేల మంది ఉద్యోగులున్నారు. సంస్థ నిర్ణయంతో రాబోయే రోజుల్లో వీరి సంఖ్య భారీగా తగ్గనుంది. ఈ ఏడాది ఆరంభంలోనూ హెచ్‌పీ దాదాపు 1000-2000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటన చేసిన విషయం తెలిసిందే.

## స్టాక్ మార్కెట్లలో లాభాల సునామీ..

**రికార్డు శిఖరాలకు చేరువలో సూచీలు**

**1022 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్, 320 పాయింట్లు పెరిగిన నిఫ్టీ**

**అన్ని రంగాల షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్లు**

**తొలిసారిగా 26,200 స్థాయిని దాటిన నిఫ్టీ**

**గ్లోబల్ ర్యాలీ, దేశీయ పెట్టుబడులే కారణమంటున్న నిపుణులు**




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం సరికొత్త రికార్డులకు అతి చేరువలో ముగిశాయి. అన్ని రంగాల్లోనూ కొనుగోళ్ల వెల్లువ వెల్లువెత్తడంతో సూచీలు అప్రతిహతంగా దూసుకెళ్లాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలకు తోడు, దేశీయ పెట్టుబడిదారుల నుంచి బలమైన మద్దతు లభించడంతో ఇన్వెస్టర్ల సంపద భారీగా పెరిగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ ఏకంగా 1,022.5 పాయింట్లు ఎగబాకి 85,609.51 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ కూడా 320.5 పాయింట్లు లాభపడి 26,205.3 వద్ద ముగిసింది. ఇది మార్కెట్ చరిత్రలో ఒక కీలకమైన ఘట్టంగా నిలిచింది.

### బుల్లిష్ సంకేతాలు

నిఫ్టీ చరిత్రలో తొలిసారిగా 26,200 కీలక స్థాయిని దాటి ముగియడం మార్కెట్ సెంటిమెంట్‌కు మరింత బలాన్నిచ్చింది. సాంకేతిక విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీ చార్టులపై 'ఫుల్ బుల్లిష్ మరుబోజు క్యాండిల్' ఏర్పడింది. దీని అర్థం, ట్రేడింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు కొనుగోళ్ల ఆధిపత్యమే కొనసాగిందని, అమ్మకాల ఒత్తిడి దాదాపుగా కనిపించలేదని మార్కెట్ పరిశీలకులు వివరిస్తున్నారు. ఈ పరిణామం మార్కెట్లో బలమైన అప్‌ట్రెండ్ కొనసాగుతోందనడానికి స్పష్టమైన సంకేతమని వారు పేర్కొంటున్నారు. సెషన్ మొత్తంలో సూచీలు ఎక్కడా తగ్గకుండా పైపైకి కదలడం ఈ ధోరణిని ధ్రువపరుస్తోంది.

### రాబోయే లక్ష్యాలివే

మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం, నిఫ్టీకి 26,000 పాయింట్ల వద్ద బలమైన మద్దతు లభిస్తోంది. ఈ స్థాయికి పైన సూచీ స్థిరంగా కొనసాగితే, రాబోయే సెషన్లలో తన ఆల్-టైమ్ గరిష్ఠాలైన 26,277-26,350 జోన్‌ను సవాలు చేసేందుకు సిద్ధంగా ఉందని వారు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత కొనుగోళ్ల జోరు కొనసాగితే ఈ లక్ష్యాలను అందుకోవడం కష్టం కాకపోవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

### అన్ని రంగాల్లో కొనుగోళ్ల జోరు

ఈ ర్యాలీలో అన్ని రంగాల షేర్లు పాలుపంచుకున్నాయి. సెన్సెక్స్‌లో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, సన్ ఫార్మా, టాటా మోటార్స్ వంటి ప్రధాన షేర్లు టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. అయితే, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ మాత్రమే నష్టాలతో ముగియడం గమనార్హం.

రంగాలవారీగా చూస్తే, అన్ని సెక్టోరల్ సూచీలు లాభాల్లోనే ముగిశాయి. ముఖ్యంగా నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 2.06 శాతం వృద్ధితో ర్యాలీకి నాయకత్వం వహించింది. దీని తర్వాత నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ (1.75%), నిఫ్టీ ఎనర్జీ (1.74%) సూచీలు కూడా గణనీయంగా లాభపడ్డాయి.

బ్రాడర్ మార్కెట్లలోనూ కొనుగోళ్ల ఉత్సాహం స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.27 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 1.36 శాతం చొప్పున పెరిగాయి.

### ర్యాలీకి కారణాలివే...!

మార్కెట్ నిపుణుల ప్రకారం, ఈ భారీ లాభాలకు పలు అంశాలు దోహదపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా పండుగ సీజన్ కావడంతో మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ నెలకొంది. దీనిని 'శాంటా క్లాజ్ ర్యాలీ'గా పిలుస్తారు. ఈ గ్లోబల్ సానుకూల పవనాలకు తోడు, దేశీయంగా రిటైల్ ఇన్వెస్టర్లు, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి భారీగా పెట్టుబడులు రావడం మార్కెట్లకు ప్రధాన చోదక శక్తిగా నిలిచింది.

అయితే, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రవాహం మాత్రం పరిమితంగానే ఉంది. మరోవైపు, రష్యా-ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరవచ్చనే ఆశలు కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయని, ఇది రాబోయే నూతన సంవత్సరానికి సానుకూల దృక్పథాన్ని కల్పిస్తోందని విశ్లేషకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## ధనికులను వణికిస్తున్న వెల్త్ ట్యాక్స్!



**న్యూఢిల్లీ:** కొంత మందికి ఎంత సంపాదించినా తృప్తి ఉండదు. వేలు.. లక్షల కోట్లు పోగేసి అపర కుబేరులుగా ఎదిగిపోతుంటారు. కానీ సంపాదించింది కాస్త వదులుకోవాలంటే మాత్రం అస్సలు వదులుకోలేరు. సంపదను కాపాడుకోవడం కోసం దేశాలు సైతం మారుస్తూ ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా ధనికుల ఆస్తులు పెరుగుతూనే ఉండటం, భారీ ఆర్థిక అసమానత పెరుగుతున్న నేపథ్యంలో పలు దేశాలు "వెల్త్ ట్యాక్స్" లేదా "నెట్‌వర్త్ ట్యాక్స్" విధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఒక వ్యక్తి వద్ద ఉన్న సంపదపై (ఆస్తి, షేర్లు, డిపాజిట్లు, ఖరీదైన ఆభరణాలు మొదలైనవి) నేరుగా పన్ను విధించే ఈ విధానం కొన్ని దేశాల్లో ఇంకా అమల్లో ఉండగా, మరికొన్ని దేశాలు దానిని రద్దు చేశాయి.

# రెండో టెస్టులో భారత్ ఘోర పరాజయం..

**దక్షిణాఫ్రికా చేతిలో వైట్ వాష్**

**భారత్‌కు పరాభవం..**

**టెస్టు సిరీస్ గెలిచిన దక్షిణాఫ్రికా**

**చరిత్ర సృష్టించిన దక్షిణాఫ్రికా..**

**రెండుసార్లు స్వదేశంలో భారత్‌ను రెండుసార్లు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన జట్టుగా ఘనత..!**

**గౌహతి:** దక్షిణాఫ్రికా కొత్త రికార్డు క్రియేట్ చేసింది. ఇండియాతో జరిగిన టెస్టు సిరీస్‌ను 2-0 తేడాతో సొంతం చేసుకున్నది. గౌహతిలో జరిగిన రెండో టెస్టులో సౌతాఫ్రికా 408 రన్స్ తేడాతో విజయం సాధించింది. గతంలో 2000 సంవత్సరంలో హన్సీ క్రానే నేతృత్వంలోని దక్షిణాఫ్రికా చేతిలో కూడా ఇండియా టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. రెండో ఇన్నింగ్స్‌లో 549 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇండియన్ టీమ్.. 63.5 ఓవర్లలో 140 రన్స్‌కే ఆలౌటైంది. దక్షిణాఫ్రికా స్పిన్నర్ హార్మర్ రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసి ఇండియాను దెబ్బతీశాడు. స్వదేశీ పిచ్‌లపై ఇండియా దారుణమైన రీతిలో ఓటమిని చవిచూసింది. మరీ 408 రన్స్ తేడాతో స్వంత పిచ్‌పై ఓడిపోవడం .. ఇండియన్ బ్యాటింగ్ లైనప్‌లో బలహీనతలను బయటపెట్టింది.

రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లలో రవీంద్ర జడేజా ఒక్కడే హాఫ్ సెంచరీ చేశాడు. 54 రన్స్ చేసిన జడేజా స్పిన్నర్ మహారాజ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. క్రీజ్‌లో నిలదొక్కుకునేందుకు బ్యాటర్ సాయి సుదర్శన్ తీవ్ర ప్రయత్నం చేశాడు. అతను 139 బంతులు ఆడి కేవలం 14 రన్స్ మాత్రమే చేశాడు. కెప్టెన్ పంత్ కేవలం 13 రన్స్ చేసి నిష్క్రమించాడు. ఆల్‌రౌండర్ సుందర్ 16 రన్స్ చేయగా, ఇక నితీశ్ కుమార్ రెడ్డి ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరుకున్నాడు.

### చరిత్ర సృష్టించిన దక్షిణాఫ్రికా..

స్వదేశంలో భారత జట్టు మరోసారి ఘోర పరాజయం పాలైంది. దక్షిణాఫ్రికా రెండు మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో భారత్ 2-0 తేడాతో ఓడించింది. కోల్‌కతా టెస్టును 30 పరుగుల తేడాతో.. తాజాగా గౌహతి టెస్టను 408 పరుగుల తేడాతో గెలిచింది. ఇదే టెస్టుల్లో భారత్‌కు అతిపెద్ద ఓటమి. ఒకప్పుడు స్వదేశంలో టెస్టుల్లో విజృంభించిన భారత జట్టు ప్రస్తుతం.. పసికూనల స్థాయికి చేరింది. ఈ క్రమంలో ప్రపంచ టెస్ట్ చాంపియన్ దక్షిణాఫ్రికా సరికొత్త చరిత్ర సృష్టించింది. 25 సంవత్సరాల తర్వాత భారత్‌లో టెస్టు సిరీస్‌ను గెలిచింది. దక్షిణాఫ్రికా చివరిసారిగా 2000 సంవల్సరంలో భారతదేశంలో టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది. ఆ సమయంలో దక్షిణాఫ్రికా టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను క్లీన్ స్లీప్ చేసింది.




### 2000లో దక్షిణాఫ్రికా చేతిలో వైట్‌వాష్..

2000 సంవత్సరంలో దక్షిణాఫ్రికా రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను వైట్‌వాష్ చేసింది. స్వదేశంలో భారత్‌పై దక్షిణాఫ్రికా రెండు టెస్ట్ సిరీస్‌లను గెలిచింది. రెండు టెస్టుల్లోనూ భారత్‌ను వైట్‌వాష్ చేసింది. ప్రొటీస్ జట్టు తన స్వదేశంలో రెండుసార్లు టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను క్లీన్ స్వీప్ చేసిన తొలి జట్టునుగా నిలిచింది. భారత్ స్వదేశంలో మూడుసార్లు క్లీన్ స్వీప్‌కు గురైంది. దక్షిణాఫ్రికా కంటే ముందు న్యూజిలాండ్ సైతం వైట్‌వాష్ చేసిన విషయం తెలిసిందే.



భారత్-దక్షిణాఫ్రికా మధ్య టెస్ట్ క్రికెట్ 1992-93లో ప్రారంభమైంది. అప్పటి నుంచి రెండు జట్ల మధ్య మొత్తం 17 ద్వైపాక్షిక టెస్ట్ సిరీస్‌లు జరిగాయి. ఈ సిరీస్‌లలో భారత్ కేవలం నాలుగు మాత్రమే గెలిచింది. దక్షిణాఫ్రికా తొమ్మిది సార్లు గెలిచింది. మిగిలిన నాలుగు సిరీస్‌లు డ్రాగా ముగిశాయి. టెస్ట్ క్రికెట్‌లో భారత్‌పై దక్షిణాఫ్రికా ఆధిపత్యం ప్రదర్శించింది. దక్షిణాఫ్రికా గడ్డపై భారత్ ఇబ్బందులుపడింది. కానీ ఈ సిరీస్‌కు ముందు టీమిండియా ఇండియా స్వదేశంలో ప్రొటీస్‌పై అద్భుతంగా ప్రదర్శన ఇచ్చింది. దక్షిణాఫ్రికాతో సొంత మైదానంలో జరిగిన నాలుగు సిరీస్‌లను భారత్ గెలిచింది.

### ముగిసిన భారత ఆధిపత్యం..

తాజాగా స్వదేశంలో సైతం భారతదేశ ఆధిపత్యం ముగిసేలా కనిపిస్తోంది. భారత జట్టు తమ సొంత గడ్డపై దక్షిణాఫ్రికాతో మొత్తం ఎనిమిది టెస్ట్ సిరీస్‌లు ఆడింది. ఇందులో నాలుగు గెలిచింది. ఈ సిరీస్‌లతో సహా దక్షిణాఫ్రికా రెండు సిరీస్‌లను గెలుచుకుంది. రెండు సిరీస్‌లు డ్రాగా ముగిశాయి. కాగా, దక్షిణాఫ్రికా గడ్డపై భారత్ తొమ్మిది టెస్ట్ సిరీస్‌లు ఆడింది. దక్షిణాఫ్రికా జట్టు ఏడు సిరీస్‌లను గెలుచుకోగా, రెండు సిరీస్‌లు డ్రా అయ్యాయి. 1996, 2004, 2015, 2019లో దక్షిణాఫ్రికాపై భారత్ టెస్ట్ సిరీస్‌ను గెలిచింది. చివరిసారిగా దక్షిణాఫ్రికాను టెస్ట్ సిరీస్‌లో ఓడించింది. ఆరు సంవత్సరాల కిందట ఓడించింది. మరోవైపు, భారత్‌లో దక్షిణాఫ్రికా రెండుసార్లు మాత్రమే విజయం సాధించింది. 2000, 2025 సంవత్సరాల్లో భారత్‌ను వైట్‌వాష్ చేసి.. సిరీస్‌లను నెగ్గింది.

## దక్షిణాఫ్రికాపై దారుణ ఓటమి..

**డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఐదోస్థానానికి పడిపోయిన టీమిండియా..!**

**గౌహతి:** గౌహతిలో దక్షిణాఫ్రికాతో జరిగి రెండో టెస్టులో భారత జట్టు ఘోర ఓటమిపాలైంది. సొంతగడ్డపై భారత్ 0-2 తేడాతో వైట్‌వాష్‌కు గురైంది. దాంతో ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో స్థానం దిగజారింది. దాయాది దేశం పాకిస్తాన్ జట్టు తర్వాత ఐదోస్థానానికి పడిపోయింది. స్వదేశంలో భారత్‌కు దారుణమైన ఓటమిని చవిచూసింది. గౌహతి టెస్టను దక్షిణాఫ్రికా 408 పరుగుల తేడాతో గెలిచింది. రెండు మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను వైట్‌వాష్ చేసింది. కోల్‌కతా టెస్ట్‌ను దక్షిణాఫ్రికా 30 పరుగుల తేడాతో గెలిచిన బావుమా నేతృత్వంలోని ప్రొటీస్ జట్టు.. గౌహతి టెస్టులో భారత్‌కు 549 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌ను 140 పరుగులకు ఆలౌట్ చేసి 408 పరుగుల తేడాతో సిరీస్‌ను గెలిచింది.

ఇది టెస్ట్ క్రికెట్‌లో, స్వదేశంలో పరుగుల పరంగా భారత్‌కు అతిపెద్ద ఓటమి. గతంలో 2004లో నాగ్‌పూర్‌లో ఆస్ట్రేలియా చేతిలో టీమిండియా 342 పరుగుల తేడాతో ఓడిపోయింది. 13 నెలల్లో ఒక జట్టు స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను క్లీన్ స్వీప్ చేయడం ఇది రెండోసారి. గతేడాది అక్టోబర్-



నవంబర్-2024 మధ్య జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను న్యూజిలాండ్ వైట్‌వాష్ చేసింది. న్యూజిలాండ్ మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను 3-0 తేడాతో ఓడించింది. తాజాగా ప్రొటీస్ జట్టు చేతిలో ఓటమి ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో దారుణంగా ఐదోస్థానానికి చేరుకుంది. భారత జట్టు ప్రపంచ టెస్ట్ చాంపియన్ ఫైనల్ ఆశలను దెబ్బతీసింది. ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా రెండోస్థానాన్ని పదిలం చేసుకుంది. ప్రస్తుత వరల్డ్ చాంపియన్‌షిప్ టెస్ట్ సైకిల్‌లో దక్షిణాఫ్రికా ఇప్పటి వరకు నాలుగు టెస్టులు ఆడింది.

ఇందులో మూడు గెలిచి ఓ మ్యాచ్‌లో ఓటమిపాలైంది. దక్షిణాఫ్రికా ప్రస్తుతం 36 పాయింట్లతో 75 శాతం శాతంతో రెండోస్థానంలో ఉంది. మరో వైపు భారత జట్టు స్థానం దిగజారింది. ప్రస్తుతం భారత్ కంటే పాకిస్తాన్ మెరుగ్గా నాలుగో స్థానంలో ఉంది. భారత్ తొమ్మిది టెస్ట్ మ్యాచుల్లో నాలుగు ఓడిపోయింది. నాలుగు టెస్టుల్లో గెలువగా.. ఓ టెస్ట్ డ్రాగా ముగిసింది. 52 పాయింట్లు, 48.15 శాతంతో ఐదవ స్థానంలో కొనసాగుతున్నది.

## నా భవిష్యత్తును బీసీసీఐ నిర్ణయిస్తుంది: గౌతం గంభీర్

**గౌహతి:** దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో పేలవ ఫామ్ కొనసాగించిన టీమిండియాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హెడ్ కోచ్ గౌతం గంభీర్‌పై కూడా తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గంభీర్ స్పందిస్తూ తన భవిష్యత్తును బీసీసీఐ నిర్ణయిస్తుందన్నారు. అయితే తన హయాంలో భారత జట్టు సాధించిన విజయాలను కూడా గుర్తుపెట్టుకోవాలన్నారు. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టెస్టులో 408 రన్స్ తేడాతో ఇండియా ఓటమి పాలైన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. నా భవిష్యత్తును నిర్ణయించేది బీసీసీఐ అని, కానీ ఇంగ్లండ్‌లోనూ, చాంపియన్స్ ట్రోఫీలోనూ ఫలితాలను అందించింది కూడా తానే అని గంభీర్ అన్నారు.

సిరీస్ ఓటమి గురించి స్పందిస్తూ నిందలు అందరికీ దక్కుతాయని, తనతోనే ఆ నిందలు మొదలవుతాయన్నారు. ఇంకా బెటర్‌గా ఆడాల్సిన అవసరం ఉందన్నారు. 95/1 ఉన్న దశ నుంచి 122/7 ఏ మాత్రం సహించబోమన్నారు. ఆ బ్యాటర్ ఆ షాట్ ఆడాల్సింది కాదు అని ఓవర్నీ నిందించలేమన్నారు. తాను ఎవరినీ నిందించలేదని, అలాంటివి చేయబోనన్నారు. హెడ్ కోచ్ గంభీర్ నేతృత్వంలో ఇండియా ఇప్పటి వరకు 18 టెస్టులు ఆడింది. దాంట్లో 10 మ్యాచుల్లో ఇండియా ఓటమి పాలైంది. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో సిరీస్‌లు వైట్‌వాష్



అయ్యాయి. టెస్టు క్రికెట్ ఆడేందుకు అద్భుతమైన ట్యాలెంట్ ఉన్న క్రికెటర్లు అవసరం లేదని, కానీ తక్కువ నైపుణ్యంతో ఆడే మానసిక స్థైర్యం ఉన్న ఆటగాళ్లు కావాలన్నారు. వారి వల్ల టెస్టుల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు.

## మళ్లీ వరల్డ్ నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా రోహిత్ శర్మ..!

**న్యూఢిల్లీ:** ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి నెంబర్ స్థానానికి చేరుకున్నాడు. న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ రాడిల్ మిచెల్‌ను అధిగమించి నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. గత రెండు మ్యాచుల్లో రేటింగ్ పాయింట్లు తగ్గడంతో రాడిల్ ర్యాంకు దిగజారింది. త్వరలోనే దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ప్రారంభం కానున్న క్రమంలోనే రోహిత్ అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. రోహిత్ నంబర్ వన్ స్థానాకి చేరుకోవడంతో టీమిండియా అభిమానులు జట్టుకు శుభ సంకేతంగా భావిస్తున్నారు. ఇక ర్యాంకుల్లో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 4వ స్థానంలో, విరాట్ కోహ్లీ 5వ స్థానంలో, శ్రేయాస్ అయ్యర్ ఒక ర్యాంకు దిగజారి 9వ స్థానానికి చేరుకున్నాడు.

మిచెల్ అగ్రస్థానాన్ని కోల్పోయినప్పటికీ న్యూజిలాండ్ ఇతర ప్లేయర్స్ రాణించారు. రచిన్ రవీంద్ర ఒక స్థానం ఎగబాకి 12వ స్థానానికి చేరుకున్నారు. డెవాన్ కాన్వే 11 స్థానాలు ఎగబాకి 31వ స్థానానికి చేరాడు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హెూప్ తన అజేయ సెంచరీతో ర్యాంకింగ్స్‌లో ఎగబాకి 8వ స్థానంలో నిలిచాడు. ఇక బౌలర్లలో మిచెల్ శాంట్నర్, మాట్ హెన్రీల అద్భుత ప్రదర్శన




చేయడంతో ర్యాంకులు పెరిగాయి. శాంట్నర్ 6వ స్థానం, హెన్ని 10వ స్థానంలో నిలిచాడు. జింబాబ్వే స్టార్ ఆటగాడు సికందర్ రజా తొలిసారిగా టీ20 అంతర్జాతీయ ఆల్ రౌండర్ ర్యాంకింగ్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకొని చరిత్ర సృష్టించాడు. ట్రై-సిరీస్‌లో అతని ఆల్ రౌండ్ ప్రదర్శన చేసి అందరి ప్రశంసలు అందుకున్నాడు. టెస్టుల్లో బౌలర్స్, ఆల్‌రౌండర్ల ర్యాంకుల్లో ర్యాంకులు మారాయి.

ఇంగ్లండ్‌కు చెందిన ఓలీ పోప్ ఇప్పుడు 24వ స్థానానికి చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌కు చెందిన తైజుల్ ఇస్లాం 15వ స్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ బౌలర్లలో 5వ స్థానానికి ఎగబాకాడు. ఆల్ రౌండర్ల జాబితాలో బెన్ స్టోక్స్ రెండవ స్థానానికి చేరగా.. ఆల్‌రౌండర్ల జాబితాలో చెందిన రవీంద్ర జడేజా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇదిలా ఉండగా.. ఇటీవల రోహిత్ శర్మకు అరుదైన గౌరవం దక్కింది. రాబోయే టీ20 ప్రపంచ కప్-2026కి ఐసీసీ అతన్ని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఈ టోర్నమెంట్ భారత్-శ్రీలంక వేదికగా జరుగనున్నది. రోహిత్ ఇప్పటివరకు తొమ్మిది టీ20 ప్రపంచ కప్‌లలో ఆడాడు. ఇందులో 2024లో టీమిండియా టైటిల్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. 47 టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌ల్లో 1,220 పరుగులు చేసిన రోహిత్ ఈ కొత్త పాత్ర పోషించనున్నాడు.

MOVIE TIME

## మహేష్ బాబు సినిమా వల్లే టాలీవుడ్‌కి దూరం!

### రకుల్ ప్రీత్ సంచలన వ్యాఖ్యలు..



**టాకీస్:** టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 'కెరటం' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన రకుల్, వరుస విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. రామ్ చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రవితేజ, మహేష్ బాబు వంటి స్టార్ హీరోల సరసన నటించి మంచి క్రేజ్ సంపాదించింది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'లక్ష్యం', 'సరైనోడు', 'నాన్నకు ప్రేమతో', 'ధ్రువ' వంటి సూపర్ హిట్స్‌తో టాలీవుడ్‌లో టాప్ రేంజ్‌లో నిలిచింది. అయితే ఈ మధ్య రకుల్‌కి టాలీవుడ్‌లో అవకాశాలు కరువయ్యాయి. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రకుల్, తన కెరీర్‌ను మలుపు తిప్పిన ఘటనను బహిరంగంగా వెల్లడించింది. మహేష్ బాబు - ఏఆర్ మురుగదాస్ కాంబినేషన్‌లో వచ్చిన హై బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పైడర్' లో రకుల్ హీరోయిన్‌గా నటించిన విషయం తెలిసిందే.

## టాలీవుడ్ క్రేజీ డైరెక్టర్‌తో కార్తీ సినిమా.. !



**టాకీస్:** కోలీవుడ్ స్టార్ యాక్టర్ కార్తీకి తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ ఉందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. చివరగా నాని నటించిన హిట్ 3లో కామియో రోల్‌లో మెరిశాడు కార్తీ. కాగా ప్రస్తుతం కార్తీ నటిస్తోన్న తమిళ చిత్రం వా వాథియార్. తెలుగులో అన్నగారు వస్తారు టైటిల్‌తో రాబోతున్న ఈ మూవీ డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఇప్పుడు కార్తీ కొత్త సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌తోపాటు ఇండస్ట్రీ వర్గాల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. మ్యాడ్ ఫ్రాంచైజీతో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు డైరెక్టర్ కల్యాణ్ శంకర్. ఈ క్రేజీ డైరెక్టర్ ఇప్పటికే రవితేజతో సినిమా చేసేందుకు రెడీ కూడా అయ్యాడు. కల్యాణ్ శంకర్ తాజాగా కార్తీతో కొత్త ప్రాజెక్టును లైన్‌లో పెట్టాడన్న వార్త ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది.

టాలీవుడ్‌లో వన్ ఆఫ్ ది లీడింగ్ ప్రొడక్షన్ హౌస్‌గా కొనసాగుతున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్య దేవర నాగవంశీ ఈ మూవీని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే రానున్న రోజుల్లో ఈ సినిమాపై అధికారిక ప్రకటన రానుందని అర్థమవుతోంది. కార్తీ ఖాతాలో మరోవైపు స్పై యాక్షన్ థ్రిల్లర్ సర్దార్ 2 ఉన్న విషయం తెలిసిందే. 2026లో సర్దార్ 2 థియేటర్లలో సందడి చేయనుంది.




## ఆన్‌లైన్ వేధింపులపై సమంత పోరాటం..

### ఐక్యరాజ్యసమితితో కీలక భాగస్వామ్యం

టాకీస్: ప్రముఖ సినీ నటి సమంత మహిళలపై పెరుగుతున్న ఆన్‌లైన్ వేధింపులకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకొచ్చారు. ఈ బృహత్కార్యం కోసం ఆమె ఐక్యరాజ్య సమితికి చెందిన 'యూఎన్ విమెన్ ఇండియా'తో చేతులు కలిపారు. ఆన్‌లైన్ వేదికగా మహిళలపై జరుగుతున్న హింసను అంతం చేయడమే లక్ష్యంగా నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు 16 రోజుల పాటు జరిగే ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో తాను పాలుపంచుకుంటున్నట్లు సమంత ఇంతకు ముందే స్వయంగా వెల్లడించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో తనకున్న 37 మిలియన్ల ఫాలోవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆన్‌లైన్ వేధింపులపై తన అనుభవాలను పంచుకున్నారు. "సోషల్ మీడియాలో అసభ్యకరమైన కామెంట్స్, ఆన్‌లైన్ బెదిరింపులు, డీప్ ఫేక్ ఫొటోల వంటి అనేక రూపాల్లో మహిళలు హింసకు గురవుతున్నారు. ఒకప్పుడు ప్రత్యక్షంగా జరిగే ఈ వేధింపులు ఇప్పుడు డిజిటల్ స్క్రీన్‌లపైకి చేరాయి. ఇది మానసికంగా కుంగ దీస్తుంది, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను కూడా ఎన్నోసార్లు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన్నానని తెలిపారు. మహిళల్లో ఈ అంశంపై అవగాహన పెంచడమే ఈ ప్రచార కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని సమంత స్పష్టం చేశారు. ఆన్‌లైన్ హింసను అరికట్టడానికి మరింత బలమైన వ్యవస్థలు, కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. యూఎన్ విమెన్ ఇండియా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగం కావడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు సమంత పేర్కొన్నారు.

## యోధుడిగా బాలయ్య.. ఎన్‌బీకే 111 షూటింగ్ షురూ!




**టాకీస్:** ఒకవైపు అఖండ 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నందమూరి నటసింహం బాలయ్య మరోవైపు తన కొత్త సినిమాను పట్టాలెక్కించబోతున్నాడు. తనకు 'వీర సింహా రెడ్డి' వంటి సంచలన విజయం ఇచ్చిన దర్శకుడు గోపిచంద్ మలినేనితో బాలయ్య తన కొత్త చిత్రం చేయబోతున్నాడు. ఎన్‌బీకే 111 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్ నేడు పూజా కార్యక్రమాలతో అధికారింగా ప్రారంభమైంది. బుధవారం సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినం సందర్భంగా హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు బాలకృష్ణతో పాటు దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాత కేఎస్ రామా రావు, దర్శకుడు బుచ్చిబాబు, దర్శకుడు బాబి కొల్లి తదితరులు హాజరయ్యారు.

ఈ సినిమా ఒక చారిత్రక యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇందులో బాలకృష్ణ మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన యోధుడు పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. గోపీచంద్ మలినేని బాలయ్య పాత్ర కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, హిస్టారికల్ యాక్షన్ సీక్వెన్స్‌లను అంతర్జాతీయ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో బాలకృష్ణ సరసన స్టార్ హీరోయిన్ నయనతార నటిస్తున్నారు. 'సింహా', 'శ్రీ రామరాజ్యం' తర్వాత వీరిద్దరి కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటం విశేషం. నయన్ ఇందులో రాణి పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం బాలయ్య 'అఖండ 2' ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నప్పటికీ.. డిసెంబర్ మూడో వారం నుంచి ఎన్‌బీకే 111 రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాతో మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని తొలిసారిగా చారిత్రక నేపథ్యాన్ని ఎంచుకోవడం ప్రాజెక్టుపై ఆసక్తిని మరింత పెంచింది.

## గిర గిర గిరగింగిరాగిరే.. రోషన్ 'ఛాంపియన్' నుంచి ఫస్ట్ సింగిల్



**టాకీస్:** హీరో శ్రీకాంత్ తనయుడు రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ఛాంపియన్. ఈ సినిమాకు ప్రదీప్ అద్వైత్ దర్శకత్వం వహిస్తుండగా.. స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ కాన్సెప్ట్ బ్యానర్లు ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఇప్పటికే టీజర్‌ను విడుదల చేసిన మేకర్స్ తాజాగా ఫస్ట్ సింగిల్‌ను వదిలారు. గిర గిర గిరగింగిరాగిరే అంటూ పాట రాగా.. కాసర్ల శ్యామ్ సాహిత్యంను అందించాడు. రామ్ మిరియాలా పాడగా.. మిక్కి జే మేయర్ సంగీతంను అందించబోతున్నాడు. ఈ చిత్రంలో రోషన్ ఫుట్‌బాల్ ఆటగాడిగా కనిపించబోతున్నాడు. మలయాళ యంగ్ బ్యూటీ అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తుంది.

## 5 నెలల్లోనే షూటింగ్ కంప్లీట్.. గుమ్మడికాయ కొట్టేసిన 'పూరీసేతుపతి' టీం



**టాకీస్:** డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ పూరీసేతుపతి . ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కాబోతుంది. పూరీ కనెక్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమాను పూరీతో పాటు ఛార్మీ నిర్మిస్తుండగా.. తాజాగా ఈ సినిమాకు సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకుంది చిత్రబృందం. తాజాగా ఈ సినిమా షూటింగ్‌ను కంప్లీట్ చేసుకున్నట్లు ప్రకటించింది. జూలై మొదటి వారంలో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ తాజాగా పూర్తి అయినట్లు నిర్మాణ సంస్థ పూరీ కనెక్ట్స్ ప్రకటించింది. దీంతో కేవలం 5 నెలల్లోనే ఈ సినిమాను పూర్తి చేశారు మేకర్స్.

ఈ సందర్భంగా సెట్స్‌లో చివరిరోజున విజయ్ సేతుపతితో ఉన్న ఒక వీడియోను టీమ్ పంచుకుంది. ఈ వీడియోలో విజయ్ సేతుపతి మాట్లాడుతూ.. పూరి జగన్నాథ్, యూనిట్‌తో పనిచేసిన రోజులను మిస్ అవుతున్నానని, ఈ ప్రయాణం చాలా మధురమైన అనుభవం అని అన్నారు. ఇక షూటింగ్ పూర్తి కావడంతో చిత్ర బృందం ప్రమోషన్స్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే సినిమా టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.